ప్రజాశక్తి

శుక్రవారం 9 మే 2025 8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా

తీరంలో అప్రమత్తం

● మచిలీపట్నం, నాగాయలంక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ● మంత్రివర్గ సమావేశంలో చర్చ

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి : పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర'కు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం అభినందనలు తెలిపింది. గురువారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. దేశ సరిహద్దుల్లో యుద్ధ వాతావరణానికి సంబంధించి సుదీర్ఘంగా చర్చించారు. విశాఖ, మచిలీపట్నం, నాగాయలంక వంటి సముద్రతీర ప్రాంతాల్లో భద్రత, కార్యాచరణపై మంత్రులతో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడారు. తీర ప్రాంతాల్లో భద్రతకు సంబంధించి జాగ్రత్తగా ఉండాలని సూచించారు. తీర ప్రాంతంలోని కృష్ణాజిల్లా మచిలీపట్నం, నాగాయలంకపై ప్రత్యేక నిఘా ఉంచాలని నిర్ణయించారు. మచిలీపట్నానికి చారిత్రక నేపథ్యం ఉండడం, పోర్టు, ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం జరుగుతుండడం, తీరంలో ముఖ్యమైన నగరం కావడం వంటి అంశాల కారణంగా నిఘా పెంచి భద్రత కల్పించాలని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించారు. అలాగే నాగాయలంక మండలం గుల్లలమోదలో క్షిపణి పరీక్షా కేంద్రం పనులను ఈనెల రెండో తేదీన ప్రధాని మోడీ ప్రారంభించిన నేపథ్యంలో ఆ ప్రాంతం దేశ రక్షణ వ్యవస్థకు కీలకంగా మారింది. రాష్ట్ర విభజనకు ముందే ఈ ప్రాజెక్టు నిర్మాణానికి సముద్రతీరంలోని గుల్లలమోద పరిసర ప్రాంతం అత్యంత అనుకూలమైనదిగా కేంద్రం గుర్తించింది. ఒరిస్సాలోని బాలాకోట్ మాదిగా ఇక్కడా క్షిపణ పరీక్షా కేంద్రం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. రాష్ట్ర విభజన అనంతరం ఆ గ్రామంలో 289 హెక్టార్ల భూములను ప్రభుత్వం సేకరించింది. సుప్రీంకోర్టు క్లియరెన్స్, కేంద్ర అటవీశాఖ అనుమతులు, సిఆర్‌జడ్ రెగ్యులేషన్‌తోపాటు ఎన్విరాన్‌మెంట్ క్లియరెన్స్‌ను పూర్తి చేసి కేంద్ర రక్షణశాఖ ఆధ్వర్యాన రూ.1000 కోట్లతో గుల్లలమోద వద్ద క్షిపణి పరీక్షా కేంద్రం ఏర్పాటుకు 2019 ఆగస్టులో అప్పటి, ఇప్పటి రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ శంకుస్థాపన చేయడానికి సన్నాహాలు చేశారు. అయితే ఈ కార్యక్రమం అప్పట్లో రద్దయింది. ఆరేళ్లపాటు ఈ ప్రాజెక్టు పనులకు సంబంధించి ఎటువంటి పురోగతీ లేదు. ఈ ప్రాజెక్టు గుజరాత్‌కు తరలి వెళ్లిపోతోందనే ఊహాగానాలు వెలువడ్డాయి. అయితే ఎట్టకేలకు ఈనెల 2వ తేదీన రాష్ట్ర రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనులతోపాటు ఈ క్షిపణి పరీక్షా కేంద్రం పనులకు కూడా ప్రధాని మోడీ వర్చువల్‌గా ప్రారంభోత్సవం చేయడంతో ప్రాధాన్యత ఏర్పడింది. ప్రారంభోత్సవానికి ఎంపిక చేసిన గుల్లలమోద గ్రామానికి చెందిన 100 మంది గ్రామస్తులను మాత్రమే గొల్లలమోదలోని డిఆర్‌డివో ప్రాంగణంలోకి అనుమతించారు.

మచిలీపట్నం లైట్ హౌస్ ప్రాంతం (ఫైల్), పోలీసుల నిఘా (అంతర్‌చిత్రంలో)

ముందుగా క్షిపణి ప్రయోగ కేంద్రాన్ని డిఆర్‌డిఒ ఛైర్మన్ డాక్టర్ సమీర్ వి.కామత్, డైరెక్టర్ చోబే, ప్రాజెక్టు మేనేజర్ కల్నల్ సమీర్ శర్మతోపాటు 20 మంది అధికారులు కూడా ఈ కేంద్రాన్ని సందర్శించారు. ఈ కేంద్రాన్ని నవదుర్గ మిస్సైల్ టెస్టింగ్ రేంజ్‌గా ప్రధాని ప్రకటించారని కల్నల్ శర్మ వెల్లడించారు. తాగాజా పాకిస్థాన్‌తో యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో తీర ప్రాంతాల భద్రతపై మంత్రివర్గం చర్చించి భద్రతకు, నిఘా ఏర్పాటుకు పలు సూచనలు చేసింది. ఇప్పటికే పాకిస్థాన్ సైన్యం సముద్రతీరం ప్రాంతాల్లోకి ప్రవేశిస్తే ఎలా ఎదుర్కొవాలో ఆయా ప్రాంతాల వాసులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి గ్రామంలోనూ మైక్ ప్రచారం చేస్తున్నారు. కృష్ణాజిల్లా ఎస్‌పి ఆర్.గంగాధర్ ఆధ్వర్యంలో మెరైన్ పోలీసులు అప్రమత్తం అయ్యారు. కొత్త వ్యక్తుల రాకపోకలను గమనిస్తున్నారు. గిలకలదిండి మెరైన్ సిఐ వంశీకృష్ణ, ఎస్ఐ బోస్ నేతృత్వంలో మెరైన్ సిబ్బంది సముద్ర తీర ప్రాంత గ్రామాలైన గిలకలదిండి, పాలకాయతిప్ప, వరలగొందితిప్పల్లో నిఘా ఏర్పాటు చేశారు. ఆరు డ్రోన్లు నిరంతరం సముద్ర తీరంలో జల్లెడ పడుతున్నాయి. గిలకలదిండిలో 17 మంది, వర్లగొందితిప్పలో 22 మంది, పాలకాయతిప్పలో 26 మంది నిత్యం గస్తీ నిర్వహిస్తున్నారు. కృష్ణాజిల్లాలోని 110 కిలోమీటర్ల ఉన్న తీర ప్రాంతంపై నిఘా ఉంచి ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తున్నారు.

బోల్తా పడిన ట్రాక్టర్; అంతర్‌చిత్రంలో అరుణ్, అభిషేక్

పెళ్లి బృందం ట్రాక్టర్ బోల్తా

- ఇద్దరు యువకులు దుర్మరణం
- ఆరుగురికి తీవ్ర గాయాలు
- ఒకరి పరిస్థితి ఆందోళనకరం

ప్రజాశక్తి - గుడ్లవల్లేరు

ట్రాక్టర్‌పై పెళ్లికి బయలుదేరిన బృందంలో ఇద్దరు యువకులు మరణించడంతో విషాదం నెలకొంది. ట్రాక్టర్ తిరగబడటంతో ఇద్దరు మరణించగా, ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఒక పరిస్థితి విషమంగా ఉంది. ఎఎస్ఐ వి.బాల వెంకటేశ్వరరావు కథనం ప్రకారం.... కృష్ణాజిల్లా నందివాడ మండలం రుద్రపాక సమీపంలోని గాజులపాలెంలో జరిగే వివాహానికి గురువారం గుడ్లవల్లేరు మండలం విన్నకోటకు చెందిన బంధువులు ట్రాక్టర్‌లో బయలుదేరారు. ట్రాక్టర్ బయలుదేరిన వెంటనే అదుపు తప్పి తిరగబడింది. దీంతో ముత్యాల అరుణ్(16), కూరెళ్ల అభిషేక్(15), కె.జయరాజు, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అరుణ్, అభిషేక్ మరణించారు. జయరాజు పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. క్షతగాత్రులు గుడివాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇద్దరు యువకుల మృతదేహాలకు గుడివాడ ఏరియా ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పరిశీలన, అధ్యయనానికి విజ్ఞాన యాత్ర దోహదం

డిప్యూటీ మేయర్ అవుతు, యాత్ర సమన్వయకర్త సత్యనారాయణ

ప్రజాశక్తి - విజయవాడ : విజయవాడ నగరపాలక సంస్థ తరుపున కార్పొరేటర్ల బృందం రెండు వారాలపాటు జరిపిన విజ్ఞాన యాత్ర పలు అంశాల అధ్యయనానికి, పరిశీలనకు ఉపయోగ పడ్డాయని నగర డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, టూర్ కో ఆర్డినేటర్, వైసిపి ఫ్లోర్‌లీడర్ అరవ సత్యనారాయణ తెలిపారు. విఎంసి కమాండ్ కంట్రోల్ రూమ్‌లో వారు గురువారం మీడియాతో మాట్లాడుతూ విజ్ఞాన యాత్ర విశేషాలను వివరించారు. గత నెల 21 నుంచి ఈనెల 4వ తేదీ వరకు జరిగిన దక్షిణాది రాష్ట్రాల కార్పొరేటర్ల విజ్ఞానయాత్ర అనేక అంశాలను పరిశీలించేందుకు, అధ్యయనం చేసేందుకు ఉపయోగపడిందన్నారు. బెంగుళూరు, మైసూరు, మధురై, నాగర్ కోయిల్, తిరువనంతపురం, కోచిన్ కార్పొరేషన్ల పరిధిలో మంచినీటి సరఫరా, పారిశుధ్యం, వివిధ అభివృద్ధి పనులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల అమలు తదితర అంశాలను విఎంసి కార్పొరేటర్ల బృందం క్షుణ్ణంగా పరిశీలించిందన్నారు. తమ పర్యటనలో తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల పరిధిలోని ఆరు కార్పొరేషన్లను పరిశీలించామని, వాటి పరిధిలో చేపట్టిన పాలనా పరమైన అంశాలు, వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరును ఆయా పాలకవర్గాలు, అధికారుల నుంచి తెలుసుకునే అవకాశం కలిగిందని చెప్పారు. దక్షిణాది రాష్ట్రాలపరిధిలోనే గాకుండా దేశ స్థాయిలోనే పారిశుధ్య నిర్వహణలో విజయవాడ నగరపాలక సంస్థ పలు ఉత్తమ అవార్డులు స్వీకరించిన అంశాలు తమ దృష్టిలో ఉన్నాయని ఆయా నగరాల్లోని పాలకవర్గాలు చెప్పారని తెలిపారు. ఇది తమకు ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. ఈ సమావేశంలో టిడిపి డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు, కార్పొరేటర్లు యలకల చలపతిరావు, శీరంశెట్టి పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

మీడియాతో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, యాత్ర సమన్వయకర్త అరవ సత్యనారాయణ

ఇంటర్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు

కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ ఆదేశం

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ఇంటర్ అడ్వాన్స్‌సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన ఇంటర్మీడియెట్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై సమన్వయ శాఖల అధికారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 12 నుంచి 20వ తేదీ వరకు ప్రతి రోజూ ఉదయం 9 నుంచి 12 గంటల వరకు ఇంటర్ మొదటి సంవత్సరం, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరుగుతాయన్నారు. మొదటి సంవత్సరానికి సంబంధించి బెటర్‌మెంట్ రాసే విద్యార్థులతో కలుపుకొని మొత్తం 28,909 మంది విద్యార్థులకు 73 పరీక్షా కేంద్రాలు, అలాగే 5,565 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు 23 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. పరీక్షల పర్యవేక్షణకు నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్ బందాలు, నాలుగు సిట్టింగ్ స్క్వాడ్ బందాలను నియమిస్తున్నట్లు తెలిపారు. పరీక్ష పత్రాలను స్టోరేజ్ పాయింట్ల నుంచి పరీక్షా కేంద్రాలకు తరలింపు వరకు ప్రతిదశలోనూ అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. బందోబస్తు ఏర్పాట్లు, భద్రతా చర్యలు, సీసీ కెమెరాల నిఘా విషయంలో పోలీసు శాఖతో సమన్వయం చేసుకోవాలన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రానికి చేరుకునేలా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపాలని సూచించారు. వేసవిని దష్టిలో ఉంచుకొని తాగునీరు, విద్యుత్ సరఫరాకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద తప్పనిసరిగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, ప్రాథమిక చికిత్స కిట్లను, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందు బాటులో ఉంచుకోవాలన్నారు. అన్ని పరీక్షా కేంద్రాలను నో సెల్ ఫోన్ జోన్లుగా ప్రకటించినందున, అందుకు తగ్గట్లు భద్రతా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థుల భవిష్యత్తును దష్టిలో ఉంచుకొని ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పరీక్షలను విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి (డీఐఈవో) బి.ప్రభాకరరావు, డీఈవో యూవీ సుబ్బారావు, డీఈసీ సభ్యులు జి.ర్ఘూన్సీ, ఎన్.వెంకటర్‌రావు, టి.ఆర్యపతి, విజయవాడ నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ డి.చంద్రశేఖర్, డీపీవో పి.లావణ్య కుమారితో పాటు విద్యుత్, వైద్య ఆరోగ్యం, పోస్టల్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర

వీధివ్యాపారుల సమస్యలపై సమీక్ష

ప్రజాశక్తి - విజయవాడ : నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర గురువారం విఎంసి ప్రధాన కార్యాలయంలో టౌన్ వెండింగ్ కమిటీతో మొదటి సమావేశం నిర్వహించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఏర్పడిన టౌన్ వెండింగ్ కమిటీలో 19 మంది సభ్యులతో చైర్మన్‌గా ఉన్న కమిషనర్ ఈ సమావేశంలో వీధి వ్యాపారస్తులకు ఉండే సమస్యల గురించి తెలియజేయాలని కోరారు. వీధి వ్యాపారులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలని, వ్యాపారం చేసే ప్రతి వీధి వ్యాపారుడికి ట్రేడ్ లైసెన్స్ ఉండాలని అన్నారు. వీధి వ్యాపారస్తులు రెడ్ జోన్, గ్రీన్ జోన్, అంబర్ జోన్ వంటి మూడు జోన్లలో వ్యాపారం చేసుకోవచ్చున్నారు. అయితే ఏ ఏ ప్రాంతాలు ఏఏ జోన్లలోకి రావాలో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి కమిటీకి నివేదిక సమర్పించాలని తెలిపారు. 2018లో చేసిన సర్వే ప్రకారం 17 వేల వీధి విక్రయదారులు ఉన్నారని తెలిపారు. మళ్లీ సర్వే చేసి ప్రస్తుతం ఉన్న వీధివిక్రయదారులను తెలుసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్ట్రీట్ వండర్స్ యాక్ట్ ప్రకారం వారికి విఎంసి తరఫున ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా కమిటీ ద్వారా జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ శర్వాణి మూర్తి, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యుసిడి) పి వెంకటనారాయణ, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ అన్నపూర్ణ, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్ బాబు, లీడ్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

అన్ని మరుగుదొడ్లను అందుబాటులోకి తేవాలి

విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర

ప్రజాశక్తి - భవానీపురం : నగరపాలక సంస్థ పరిధిలో గల మరుగుదొడ్లు అన్ని అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. భవానీపురం, ఆర్టీసీ వర్క్ షాప్ రోడ్, హెచ్ బి కాలనీ, సివిఆర్ ఫ్లైఓవర్ ప్రాంతాల్లో ఆయన గురువారం పర్యటించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎక్కడైనా మరమ్మతులు ఉంటే వెంటనే చేయించాలన్నారు. ఆర్టీసీ వర్క్ షాప్ రోడ్‌లో 200 మీటర్ల విస్తీర్ణంలో 40 వీధి విక్రయదారులకు నేషనల్ అర్బన్ లైవ్లీహుడ్ మిషన్‌లో భాగంగా అభివద్ధి చేయబడుతున్న స్మార్ట్ స్ట్రీట్‌ను పరిశీలించారు. తదుపరి హెచ్ బి కాలనీలో గల అన్నా క్యాంటీన్‌ను పరిశీలించారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ ఆర్ శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, ఇన్చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకష్ణ నాయక్, సూపరింటెండెంటింగ్ ఇంజనీర్ పి సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సురేఖ, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ అన్నపూర్ణ, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్, జాయింట్ డైరెక్టర్ లత, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యు సి డి) పి వెంకటనారాయణ పాల్గొన్నారు.

వేగంగా జల్ జీవన్ మిషన్ పనులు : కలెక్టర్ లక్ష్మీశ

ప్రజాశక్తి - విజయవాడ : జలజీవన్ మిషన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. జలజీవన్ మిషన్ పథకంపై గురువారం న్యూఢిల్లీ నుండి ప్రాజెక్టు అమలు జరుగుతున్న రాష్ట్రాలలోని జిల్లాల కలెక్టర్లతో కేంద్ర జల జీవన్ మిషన్ ఉన్నతాధికారులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు నగరంలోని కలెక్టరేట్ నుండి ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా తాగునీరు అందించే జల జీవన్ మిషన్ పనులు శరవేగంగా జరుగుతున్నా యన్నారు. రూ.6,100 కోట్లతో 16 మండలాలు, కష్ణాజిల్లాలోని 24 మండలాలు, ఏలూరు జిల్లాలోని పది మండలాలు మొత్తం 50 మండలాలను కలిపి వాటర్ గ్రిడ్ ఏర్పాటుచేసి తాగునీరు అందించే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నా మన్నారు. ఎన్‌టిఆర్ జిల్లాలో రూ.2 వేల కోట్లతో 337 పనులు జరుగుతున్నాయని, ఇవి వచ్చే ఆగస్టు నాటికి పూర్తయ్యేవిధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పులిచింతల నుండి నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గంలోని ఏడు మండలాల్లోని గ్రామాలకు, ఇబ్రహీంపట్నం వద్ద విటిపిఎస్ కూలింగ్ కెనాల్ నుండి మైలవరం, జి.కొండూరు, తిరువూరు, ఎ.కొండూరు మండలాలలోని వివిధ గ్రామాలతోపాటు గొల్లపూడి వద్ద నుండి ఏలూరు జిల్లాలోని 10 మండలాలు, కష్ణాజిల్లాలోని 24 మండలాలు, ఎన్టీఆర్ జిల్లాలోని తిరువూరు, విస్సన్నపేట, జి.కొండూరు మండలాల్లోని వివిధ గ్రామాలకు జలజీవన్ మిషన్ ద్వారా తాగునీరు అందించ కార్యక్రమానికి చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ వివరించారు. ఈ సమావేశంలో గ్రామీణ నీటి సరఫరా ఎస్ఈ ఎస్.విద్యాసాగర్ పాల్గొన్నారు.

PASSPORT LOST

The General Public is hear by information that I **BHUTAPATI SRINIVAS, S/O. B. CHARLES,** age: 41 years , Door No.26-20-2, Swamy Street, Gandhi Nagar, Vijayawada Urban, N.T.R District-520008, Lost my passport issued at Republic of India, lost my original passport while I was travelling by PWD Ground to passport office, M.G Road, Vijayawada on 25-04-2025 and inspite of my best efforts I am unable to trace it and it lost beyond recovery. If any body find please inform me on above adress. **Cell : 9826364656**

పేరు మార్పు / సవరణ

నేను బడే మంగతాయారు D/o బడే వెంకటేశ్వరరావు కోడూరు మండలం ఉల్లిపాలెం గ్రామం నివాసిని. కృష్ణాజిల్లా కోడూరు మండలం వి.కొత్తపాలెం గ్రామంలో నా వివాహ సమయంలో నా పేరును మంగతాయారు బదులుగా **కోసూరు అలివేలు మంగతాయారు** పేరు మార్చుకొని కోసూరు శ్రీనివాసరావును వివాహం చేసుకున్నాను. అనంతరం నా ఆధార్ కార్డులో **కోసూరు అలివేలు మంగతాయారు W/o కోసూరు శ్రీనివాసరావు** గా మార్చు కొన్నాను.

ఇట్లు,
కోసూరు అలివేలు మంగతాయారు
ఫోన్:9493380282

భారత సాల్ట్ కంపెనీకి భూములు లీజుకివ్వాలి

సిపిఎం కృష్ణాజిల్లా కార్యదర్శి వై.నరసింహారావు డిమాండ్

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్ : గత ప్రభుత్వ హయాంలో ఉత్పత్తిని నిలుపుదల చేసిన భారత సాల్ట్ ఫ్యాక్టరీకి కూటమి ప్రభుత్వం లీజు అనుమతి ఇచ్చి దానిపై ఆధారపడిన కుటుంబాలకు ఉపాధి కల్పించాలని సిపిఎం కష్ణాజిల్లా కార్యదర్శి వై.నరసింహారావు, మచిలీపట్నం నగర కార్యదర్శి బూర సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. వారు గురువారం ఒక ప్రకటన విడుదల చేస్తూ మచిలీపట్నం రూరల్ మండలం పల్లె తుమ్మలపాలెం గ్రామంలో 25 ఏళ్లుగా నడుస్తున్న భారత్ సాల్ట్ కంపెనీ గత ప్రభుత్వ హయాంలో ఉత్పత్తిని నిలిపివేసిందని గుర్తుచేశారు. కంపెనీకి ఇచ్చిన భూముల లీజు గడువు ముగిసిందని, ఆ భూములను ఇతర పరిశ్రమలకు కేటాయించాలనే పేరుతో గత వైసిపి ప్రభుత్వం భారత్ సాల్ట్ కంపెనీ మూతపడేలా చేసిందని తెలిపారు. దీంతో పరిసర గ్రామాల్లో 2 వేల కుటుంబాలకుపైగా జీవనోపాధి కోల్పోయాయని తెలిపారు. సిపిఎం ఆధ్వర్యంలో సాల్ట్ కంపెనీకి అనుమతి ఇవ్వాలని, దానిపై ఆధారపడిన కుటుంబాల ఉపాధి కాపాడాలని ఆందోళన నిర్వహించినట్లు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా కంపెనీ భూముల లీజు సంగతి తేల్చకపోవడంతో 2 వేల కుటుంబాల ఉపాధి ఆగమ్యగోచరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉప్పు ఉత్పత్తి తప్ప ఇతర వాటికి ఈ భూములు పనికిరావని, అందువల్లే ఇక్కడ పెట్రోలియం రిఫైనరీ పెట్టాలని ఆలోచన కూడా మార్చుకున్నారని గుర్తుచేశారు. వెంటనే కూటమి ప్రభుత్వం సాల్ట్ కంపెనీ భూములకు అనుమతి ఇచ్చి ఈ ప్రాంత ప్రజల ఉపాధి అవకాశాల్ని కాపాడాలని నరసింహారావు, సుబ్రహ్మణ్యం కోరారు.

ఇంస్టాగ్రామ్‌లో మోసపోయిన గృహిణి

ప్రజాశక్తి - గన్నవరం : "మేము పంపే యాడ్స్‌కు స్టార్ రేటింగ్ ఇవ్వాలి.. మీరు ఎంత పంపితే దానిని బట్టి మీకు అంత ఎక్కువ డబ్బులు తిరిగి వస్తాయి" అని చెప్పిన మాయమాటలు నమ్మి ఓ గృహిణి లక్షలు మోసపోయిన ఘటన కృష్ణాజిల్లా గన్నవరంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. శ్రీలక్ష్మి అనే మహిళ గన్నవరంలో నివసిస్తోంది. ఆమె భర్త సాంబశివరావు హోటల్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఆమె ఇంటివద్దే ఉంటోంది. గత నెల 3వ తేదీన ఇంస్టాగ్రామ్ రీల్స్ చూస్తుండగా, వర్క్‌ఫ్రమ్ హోమ్ అనే యాడ్ కనిపించింది. దీంతో ఆ యాడ్‌లో ఉన్న నెంబర్‌కు వాట్సప్ చేసింది. దీంతో వారు "మేము కొన్ని వీడియోలు పంపుతాము, వాటికి స్టార్ రేటింగ్స్ ఇవ్వాలి, మీరు డబ్బులు ఎంత పెట్టుబడి పెడతారో దానిని బట్టి వెంటనే మీ అకౌంట్లో ఎక్కువ డబ్బులు పడతాయి" అని చెప్పారు. ఆ మాటలను నమ్మిన శ్రీలక్ష్మి వారు పంపిన వీడియోను ఓపెన్ చేసి రూ.1000 పెట్టి వాటికి స్టార్ రేటింగ్స్ ఇచ్చింది. అలాచేసి వారికి వాట్సప్ చేయగా వారు ఆమెకు తిరిగి రూ.1500 అమె అకౌంట్‌కు పంపారు. ఇలా 1000 మాత్రమే కాదు మీరు ఎంతైనా వేసి రేటింగ్స్ ఇస్తే మీకు అంత ఎక్కువ డబ్బులు వస్తాయని ఆమెను నమ్మించారు. దీంతో ఆమె మూడు దఫాలుగా డబ్బులు పంపింది. ఒకసారి లక్ష రూపాయలు, అదే రోజు మరో రూ.20 వేలు వేసింది. ఆమెకు ఆ రోజు డబ్బులు తిరిగి రాకపోవడంతో వాట్సప్లో వారిని సంప్రదించింది. "మీ డబ్బులు మొత్తం రూ.1.20 లక్షలు వచ్చాయి, అయితే అవి ఫ్రీజ్ అయ్యాయి, మరో లక్ష రూపాయలు పంపితే మొత్తం డబ్బులు తిరిగి వస్తాయి" అని నమ్మించారు. వారి మాటలను గుడ్డిగా నమ్మిన మహిళ మరుసటి రోజు తన బ్యాంకు అకౌంట్ నుంచి మరో లక్ష రూపాయలు వారికి పంపింది. అయినా కూడా ఆమెకు డబ్బులు తిరిగి రాలేదు. అదేమని ఫోను చేసి వారిని అడగ్గా, మరో రూ.1.50 లక్షలు వేస్తే మొత్తం వస్తాయంటూ చెబుతుండడంతో ఆమె నమ్మి మరికొంత పంపింది. అయితే ఆ తర్వాత కూడా సంబంధిత వ్యక్తుల నుండి స్పందన లేకపోవడంతో ఆమెకు అనుమానం వచ్చి ముందు నా డబ్బులు పంపండని అడుగుతూ వచ్చింది. అయితే వారు మాటలు దాటవేస్తూ వచ్చారు. అనంతరం వారి నుంచి ఎటువంటి సమాచారం రాకపోగా ఆ నంబర్లు పని చేయకుండా పోయాయి. దీంతో తాను మోసపోయానని గ్రహించి తెలిసిన వారి ద్వారా సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

నోటీసు

మహారాజశ్రీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల సమస్యల పరిష్కార కమీషన్ గారి కోర్టు, విజయవాడలో
ఎఫ్.ఎ.నెం. 205 ఆఫ్ 2024

బిట్వీన్ :
మెస్సర్స్ టయోటా కిర్లోస్కర్ మోటార్ ప్రైవేట్ లిమిటెడ్
...పిటీషనర్ / అప్పిలెంట్ / ఆపోజిట్ పార్టీ
మరియు
మెస్సర్స్ విమ్లా ఇన్ఫ్రాస్ట్రెక్చర్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ & ఇతరులు
...రెస్పాండెంట్స్ / రెస్పాండెంట్స్ / కంప్లైనెంట్

టు
ఆర్-2:
రాధా మాధవ్ టయోటా,
ప్రధాన కార్యాలయం, ప్రతినిధి దాని అధీకృత వ్యక్తి ద్వారా,
డోర్.నెం. 4-151, ఎన్.హెచ్.-5, ప్రసాదంపాడు, కరెన్సీ నగర్, విజయవాడ,
ఆంధ్రప్రదేశ్-521108.

పై నెంబరు ఎఫ్.ఎ.నెం.205 ఆఫ్ 2024లో రెస్పాండెంట్-2 అయిన మీకు పై స్టేట్ కమీషన్ / శ్రీ కోర్టు ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను నోటీసులు పంపిననూ మీకు ముట్టనందున ఈ పేపర్ ప్రకటన ద్వారా నోటీసు చేయవలసినదిగా పైకోర్టు / స్టేట్ కమీషన్ వారు ఆర్డరు వేస్తూ ది.26-05-2025కి వాయిదా వేసియున్నారు. సదరు వాయిదా రోజు ఉదయం 10.30 ని॥లకు మీరు స్వయంగాగానీ లేక మీ అడ్వకేటు ద్వారా గానీ పై కమీషన్ వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల సదరు అప్పీలును మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం) వాయిదా తేది: 26-05-2025.
కింగ్ స్టబ్ & కసివా అడ్వకేట్స్
పిటీషనర్ / అప్పిలెంట్ / ఆపోజిట్ పార్టీ తరపు న్యాయవాది, విజయవాడ
సెల్: 9847657976

నోటీసు

మహారాజశ్రీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల సమస్యల పరిష్కార కమీషన్ గారి కోర్టు, విజయవాడలో
ఎఫ్.ఎ.నెం. 328 ఆఫ్ 2024

బిట్వీన్ :
మెస్సర్స్ టయోటా కిర్లోస్కర్ మోటార్ ప్రైవేట్ లిమిటెడ్
...పిటీషనర్ / అప్పిలెంట్ / ఆపోజిట్ పార్టీ
మరియు
బెరచ్చా మినిస్ట్రీస్ & ఇతరులు **...రెస్పాండెంట్స్ / రెస్పాండెంట్స్ / కంప్లైనెంట్**

టు
ఆర్-2: జనరల్ మేనేజర్, రాధా మాధవ్ టయోటా డీటర్, ప్లాట్ నెం. 4-151, ఎన్.హెచ్.-5, ప్రసాదంపాడు, కరెన్సీ నగర్, విజయవాడ-521108.
ఆర్-3: జనరల్ మేనేజర్, రాధా మాధవ్ ఆటోమొబైల్స్ ప్రైవేట్ లిమిటెడ్, డోర్.నెం.5-110, ఏపీ సీడ్స్ కార్పొరేషన్ ప్రక్కన, ఎన్.హెచ్.-5, ప్రసాదంపాడు, కరెన్సీ నగర్, విజయవాడ-521108.
ఆర్-4: మ్యానేజింగ్ డైరెక్టర్, రాధా మాధవ్ ఆటోమొబైల్స్ ప్రైవేట్ లిమిటెడ్, డోర్.నెం.5-110, ఏపీ సీడ్స్ కార్పొరేషన్ ప్రక్కన, ఎన్.హెచ్.-5, ప్రసాదంపాడు, కరెన్సీ నగర్, విజయవాడ-521108.

పై నెంబరు ఎఫ్.ఎ.నెం.328 ఆఫ్ 2024లో రెస్పాండెంట్-2,3 & 4 అయిన మీకు పై స్టేట్ కమీషన్ / శ్రీ కోర్టు ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను నోటీసులు పంపిననూ మీకు ముట్టనందున ఈ పేపర్ ప్రకటన ద్వారా నోటీసు చేయవలసినదిగా పైకోర్టు / స్టేట్ కమీషన్ వారు ఆర్డరు వేస్తూ ది.26-05-2025కి వాయిదా వేసియున్నారు. సదరు వాయిదా రోజు ఉదయం 10.30 ని॥లకు మీరు స్వయంగాగానీ లేక మీ అడ్వకేటు ద్వారా గానీ పై కమీషన్ వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల సదరు అప్పీలును మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం) వాయిదా తేది: 26-05-2025.
కింగ్ స్టబ్ & కసివా అడ్వకేట్స్
పిటీషనర్ / అప్పిలెంట్ / ఆపోజిట్ పార్టీ తరపు న్యాయవాది, విజయవాడ
సెల్: 9847657976

గ్రామ పంచాయతీ, కొణతమాత్మకూరు
నందిగామ మండలం, ఎన్టీఆర్ జిల్లా.
టెండర్ ప్రకటన

ఆర్ఓసి నెం. **తేదీ.. 2.5.2025**

ఎన్టీఆర్ జిల్లా, నందిగామ మండలం కొణతమాత్మకూరు గ్రామ పంచాయతీ కార్యాలయం నందు 2025-26 సం. నకు కాంట్రాక్టు లేబర్ పద్ధతి పై ఈ దిగువ తెలిపిన పనులు చేయుటకు గాను ది. 9.5.2025వ తేదీన ఉదయం 12.00 గం. లకు సీల్డు టెండర్లు స్వీకరించ బడును. అదే రోజు మద్యాహ్నం గం. 2.30.ని.లకు టెండరుదారుల సమక్షంలో టెండర్లు తెరవబడును. పూర్తి వివరాలు ఆఫీసు పని వేళల యందు అడిగి తెలుసుకొనవచ్చును.

కాలపరిమితి... 01-4-2025 నుండి 31.3.2026 వరకు

వ.నెం.	పని పేరు	ధరావత్తు
1.	వీధి విద్యుత్ దీపాలు నిర్వహణ ఒకరు	రూ. 1000/-
2.	మంచినీటి నిర్వహణ కు ఒకరు	రూ. 1000/-

గమనిక :-1. గతంలో గ్రామ పంచాయతీ లో పని చేసిన వారికి ప్రాధాన్యత.
2.గ్రామ పంచాయతీ నిధులు నిల్వ బట్టి వేతనాలు చెల్లింపులు చేయబడును.
3.టెండర్లు నిర్వహణ లేదా రద్దు చేయుటకు గ్రామ పంచాయతీ కి పూర్తి అధికారం కలదు.
4.పైన తెలిపిన పనులే కాకుండా పంచాయతీ కి సంబంధించిన ఇతర పనులు చేయుటకు అంగీకారం తెలుపవలెను.

సం॥ మేడా కోటేశ్వరరావు,
సర్పంచ్,
కొణతమాత్మకూరు గ్రామ పంచాయతీ.

సం॥ కావూరి సాంబశివరావు,
పంచాయతీ కార్యదర్శి,
కొణతమాత్మకూరు, నందిగామ మండలం,

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి - విజయవాడ : అగ్ని ప్రమాదాల నివారణకు గురువారం గాయత్రి నగర్‌లోని పలు షాపింగ్ మాల్స్‌లో విఎంసి సిబ్బంది ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో అగ్ని ప్రమాదం జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలు, అగ్ని ప్రమాద నిరోధక పరికరాలను ఉపయోగించే విధానం తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ మాల్యాద్రి, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ రాజా, ఎన్టీఆర్ కాంప్లెక్స్ వ్యాపారస్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

మచిలీపట్నంలో



పెనమలూరులో..

సమ్మె నోటీసు అందజేత

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : దేశ వ్యాప్తంగా 10 కేంద్ర కార్మిక సంఘాలు పిలుపుమేరకు నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలని, మున్సిపల్‌లో ఆప్కాస్ విధానాన్ని రద్దుచేసి ప్రవేట్ ఏజెన్సీ లకు అప్పగించారాదని, కార్మికులను రెగ్యులర్ చేయాలని తదితర డిమాండ్ల పరిష్కారానికి ఈనెలు 20 జరిగే దేశ వ్యాప్త సమ్మెలో మచిలీపట్నం మున్సిపల్ కార్మికులు పాల్గొంటారని తెలియజేస్తూ గురువారం సిఐటియు, ఏఐటీయూసీ సంఘాల ఆధ్వర్యంలో మచిలీపట్నం మున్సిపల్ కమిషనర్ వీర వెంకట సత్య బాపిరాజుకి సమ్మె నోటీసు అందజేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు కృష్ణా జిల్లా ఉపాధ్యక్షులు బూర సుబ్రహ్మణ్యం, సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్. జయరావు, ఏఐటీయూసీ మున్సిపల్ యూనియన్ నాయకులు వై ఈశ్వరరావు, యూనియన్ అధ్యక్షురాలు చుక్కాకుల బుల్లెమ్మ, ఉపాధ్యక్షులు వై విజయ, బత్రాజు సుబ్బారావు, నజీర్, ఏఐటీయూసీ నాయకులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కంకిపాడు : దేశవ్యాప్త సమ్మె పిలుపులో భాగంగా పెనమలూరు మండలంలో గంగూరు, గోసాల, వణుకూరు, చోడవరం, పెనమ లూరు, పెద్దపులిపాక పంచాయతీ కార్యదర్శులకు, సర్పం చులకి సిఐటియు ఆధ్వర్యంలో సమ్మె నోటీసు అందించారు. పెనమలూరు సిఐటి యు కార్యదర్శి ఉప్పాడ తిమూర్తులు, పెనమలూరు మండలం పంచాయతీ కార్మికుల సిఐటియు నాయకులు గోగులముడి వేణుబాబు, మోహన్ రావు, సురేష్, వేణు,దొడ్డ ప్రకాష్, కొడాలి నాగమణి,పందిపటి వాణి, కొవ్వల నాగమణి. గొర్రె రుతమ్మ. పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం చెన్నై-కోల్ కతా జాతీయ రహదారిపై గన్నవరం పట్టణ శివారులో గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానిక పెట్రోల్ బంక్ సమీపంలో గన్నవరం నుంచి హనుమాన్ జంక్షన్ వైపునకు వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి అతివేగంగా వచ్చిన లారీ ఢీకొంది. ప్రమాదంలో బైక్ వెనుక కూర్చొన్న వ్యక్తి కింద పడటంతో అతడిపై నుంచి వాహనం వెళ్లడంతో క్షతగాత్రుడు అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదుచేసి వివరాలు సేకరిస్తున్నారు. మృతుడు ఒడిశాకు చెందిన వ్యక్తిగా గుర్తించారు.

వ్యాన్ బోల్తా

ప్రజాశక్తి -నందివాడ : మండలంలోని పుట్ట గుంట గ్రామం వద్ద చేప పిల్లల వ్యాను బోల్తా పడింది. గుడివాడ నుండి నూజివీడు వైపుగా ప్రయాణం చేస్తున్న చేప పిల్లల వ్యాన్ ప్రమాద వశాత్తు కాల్వలోకి దూసుకెళ్ళింది. పండుగప్ప చాపకు గోరక తీసుకెళ్లి క్రమంలో ఈ ఘటన చోటు చేసుకుంది. వ్యాన్ లోపల వాటర్‌తో నింపి ఉండడం వలన అదుపు తప్పి ప్రమాదానికి గురైంది. ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదని స్థానికులు తెలిపారు.

సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

విద్యుత్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ధర్నా

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలం ముస్తాబాద్ గ్రామంలో షాపులకు ఏర్పాటు చేస్తున్న విద్యుత్ స్మార్ట్ మీటర్లను గురువారం సిపిఎం నాయకులు అడ్డుకున్నారు. గ్రామంలోని షాపులకు స్మార్ట్ మీటర్లు పెట్టేందుకు విద్యుత్ శాఖ సిబ్బంది వెళ్లగా విషయం తెలుసుకున్న సిపిఎం నాయకులు అక్కడకు వెళ్లి స్మార్ట్ మీటర్లు పెట్టేందుకు వీల్లేదని సిబ్బందిని ఆపారు. ప్రజలకు హాని చేసే ఈ మీటర్లు పెట్టడానికి వీల్లేదని అడ్డగించడంతో సిబ్బంది వెనక్కి వెళ్లిపోయారు. అనంతరం నాయకులు ముస్తాబాద్ విద్యుత్ సబ్ స్టేషన్ కు వెళ్లి ధర్నా చేశారు. గ్రామంలో స్మార్ట్ మీటర్లు పెట్టే కార్యక్రమాన్ని నిలుపుదల చేయాలని, విద్యుత్ భారాలను తగ్గించాలని, ట్రూ అప్ చార్జీలను నిలుపుదల చేయాలని, నినాదాలు చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కళ్ళం వెంకటేశ్వర రావు మాట్లాడుతూ.. ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలపై విద్యుత్ ధారాలను మోపేందుకు సిద్ధమైందన్నారు. కేంద్ర ప్రభుత్వం చెప్పినట్టుగా తలవగ్గి రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను ఇబ్బందులకు గురిచేసే స్మార్ట్ మీటర్లను పెడుతుందన్నారు. గతంలో వైసిపి ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు పెట్టేందుకు సిద్ధమవగా అప్పటి మాజీ సీఎంగా ఉన్న చంద్రబాబు వ్యతిరేకించారని చెప్పారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ మాటను పక్కకు నెట్టి స్మార్ట్ మీటర్లు బిగించేందుకు సిద్ధమయ్యారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పల్లంపల్లి ఆంజనేయులు, పార్టీ నాయకులు కళ్ళం రాంబాబు, కైలే ఏసుదాసు, బెజవాడ తాతబ్బాయి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

షాహిద్‌కు మంత్రి అభినందనలు



షాహిద్‌బాబును సన్మానిస్తున్న మంత్రి బాలవీరాంజనేయస్వామి

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖ, గిరిజన గురుకులాల వసతిగృహాలలో విద్యార్థినిలు ఉత్తమ ఫలితాల సాధించేందుకు కృషి చేసి కృష్ణా జిల్లాను రాష్ట్రం లోనే ప్రథమ స్థానంలో నిలిపిన కృష్ణా జిల్లా సాంఘిక సంక్షేమ ఉపసంచాలకులు ఎస్ కె షాహిద్ బాబుని సాంఘిక సంక్షేమ మంత్రి డి. బాల వీరాంజనే యస్వామి, ప్రధాన కార్యదర్శి ఎం .ఎం నాయక్, సాంఘిక సంక్షేమ డైరెక్టర్ లావణ్య వేణిలు బుధవారం విజయవాడ తుమ్మలపల్లి కళా క్షేత్రంలో జరిగిన అభినందన సభలో దుశ్యాలువాతో సత్కరించి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈ ఏడాది పదవ తరగతి, ఇంటర్ మీడియాట్ ఫలితాలలో రాష్ట్రంలోనే కృష్ణా జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. 26 జిల్లాల్లో కష్ణాజిల్లా 10 తరగతిలో 95 శాతం, ఇంటర్మీడియట్ ఫలితాల్లో 93శాతం, అత్యధిక ఉత్తీర్ణత సాధించారు. ఫలితాలలో కష్ణా జిల్లా మొదటి స్థానంలో ఉండటానికి అత్యుత్తమ పనితీరు ప్రదర్శించి కషిచేసిన షేక్ షాహిద్ బాబుని రాష్ట్రంలోనే ఉత్తమ జిల్లా సాంఘిక సంక్షేమ అధికారిగా ఎంపిక చేసి అవార్డు అందించి మంత్రి అభినందించారు.

తాడిచెట్టుపై పిడుగుపాటు

ప్రజాశక్తి-మొవ్వ : మొవ్వ మండలం కూచి పూడిలో గురువారం మధ్యాహ్నం ఒక్క సారిగా వాతావరణం మారి పిడు గులతో కూడిన వర్షం కురిసింది. ఆ సమయంలో మొవ్వ రోడ్డులోని కూచి పూడిలో డాక్టర్ గొట్టిపాటి రామకృష్ణారావు హాస్పిటల్ ఎదురుగా గల తాడిచెట్టిపై పిడుగు పడి కాలిపో యింది. ఈ సందర్భంగా చెట్లు విరిగి విద్యుత్ లైనులపై పడగా స్తంభాలు విరిగి విద్యుత్తుకుతీవ్ర అంతరాయం ఏర్పడింది. భట్లపెనుమర్రు,పెడసనగంటి పాలెం, చినముత్తేవి ప్రాంతాలలో చెట్లు విరిగి విద్యుత్ తీగల మీద పడ్డాయి.

గ్రంథాలయాల్లో విద్యార్థులకు ఆటల పోటీలు

ప్రజాశక్తి-ఉయ్యూరు : వేసవి శిక్షణ శిభిరంలో భాగంగా ఉయ్యూరు శాఖా గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు రిసోర్స్ పర్సన్ ఎన్.సింహాచలం స్పోకెన్ ఇంగ్లీష్, గ్రామర్, జనరల్ నాలెడ్జి గురించి తెలియజేశారు. కథల పుస్తకాలు చదివించి వాటిలో నీతిని తెలియజేశారు. గ్రంథాయల అధికారి బి.రమణి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఉంగుటూరు : వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఉంగుటూరు గ్రంథాలయ శాఖ ఆధ్వర్యం లో గురువారం విద్యార్థిని విద్యార్థులకు క్యారమ్స్, లూడో, స్నేక్ అండ్ లీడర్ ,పాటలు కష్ణాజిల్లాలో ఉన్న ప్రసిద్ధి కట్టడాలు ఏ ఎ ప్రాంతాల్లో ఉన్నాయి అనేది వివరించారు. అనంతరం కథలు చదివించడం, కథలు చెప్పించడం ద్వార చదవడంతో పాటు చెప్పడం అనేది అలవాటు కావాలనే ఉద్దేశంతో ఈ విధంగా నిర్వహిస్తున్నామని ఉంగుటూరు గ్రంథాలయ శాఖ అధికారి ఉప్పలపాటి చంద్రశేఖర రావు అన్నారు.

గుడ్లవల్లేరు మండలంలో ఆటల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మండల కేంద్రమైన గుడ్లవలేరు గ్రంథాలయం వద్ద విద్యార్థులకు బుట్టలో బంతి వేయు ఆటలను గురువారం నిర్వహించారు. గొర్రెల కాపరి కథలు చదివి వినిపించారు. విద్యార్థులకు నిర్వహించిన బుట్టలో బంతి ఆటను ఏకాగ్రతతో ఆడారు. అనంతరం విద్యార్థులక ఇండోర్ గేమ్ పోటీలను నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు ముగింపు రోజు బహుమతులు అందిస్తామని గ్రంథాల అధికారిని టి వాణి తెలిపారు.

భారత సైన్యానికి సంఘీభావంగా ర్యాలీ

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డలో పాకిస్తాన్పై భారత్ ఆపరేషన్ సిందూరం పేరుతో సాగుతున్న యుద్ధాన్ని స్వాగతిస్తూ విజయ సింధూరం అంటూ నినాదాలు చేస్తూ పురవీధులలో ర్యాలీ నిర్వహించారు. టిడిపి నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు టిడిపి మండల పార్టీ అధ్యక్షులు యా సం చిట్టిబాబు ఆధ్వర్యంలో జాతీయ పతాకాలు చేతబోని భారత సైన్యానికి మద్దతుగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ రాష్ట్ర మత్స్యకార విభాగం నాయకులు లంకె యుగంధర్, తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు తలసిల స్వర్ణలత, టిడిపి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మాచవరపు ఆదినారాయణ, టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు కర్ర సుధాకర్ పాల్గొన్నారు.

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఉయ్యూరు నగరపంచాయతీ పరిధిలో అంగన్వాడీ కేంద్రాలలో ఖాళీగా ఉన్న సహాయ కురాలు పోస్టులకు అర్హులైన మహిళలనుండి ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కంకిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి కేబీ సుకన్య తెలిపారు. 19, 20 వార్డులకు సంబంధించి ఇండియన్ బ్యాంక్ కేంద్రంలో ఓసీ, 5వ వార్డులో దళితవాడ- 3 కేంద్రంలో ఎస్సీ, 15వ వార్డు గిరిజన కాలనీలో ఎస్టీ మహిళలకు కేటాయించినట్టు తెలిపారు. అభ్యర్థులు స్థానికులై ఉండి జూలై 1 నాటికి 21 సంవత్సరాలు నిండి 35 సంవత్సరాల లోపు వయస్సు కలిగి ఉండాలని, ఎస్సీ, ఎస్టీల విషయంలో 21 సంవత్సరాలు నిండినవారు లేని పక్షంలో 18 సంవత్సరాలు నిండిన వారి ధరఖాస్తు పరిగణలోకి తీసుకుంటామన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన ఉండి వారి ప్రస్తుత కులధవీకరణ పత్రం, పదవ తగరతి మార్కుల జాబితా, ఆధార్, రేషన్ కార్డు ధరఖాస్తుతో జతపరచాలని, అర్హతల ధవీకరణ పత్రాలు అన్నింటిని గెజిటెడ్ ఆఫీసర్చేత అటెస్ట్ చేయించి రెండు సెట్లు జతపరచాలన్నారు. పూర్తి చేసిన ధరఖాస్తులు ఈనెల 17 సాయంత్రం 5గంటల లోపు కంకిపాడులో సమగ్ర శిశు అభివద్ధి సేవా పథకం అధికారి కార్యాలయంలో అందచేయాలన్నారు.

ప్రజాశక్తి -నందివాడ : మండలంలోని తమిరిశ గ్రామంలో ఒక అంగన్వాడీ కార్యకర్త సహాయకురాలు పోస్టుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు గుడివాడ సమగ్ర శిశు సేవ అభివద్ధి అధికారులు తెలిపారు. ఈనెల 17వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ప్రజాశక్తి..గన్నవరం : గన్నవరం ఉంగుటూరు బాపులపాడు మండల పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ కార్యకర్త, ఆయా పోస్టులు భర్తీ చేయడానికి దరఖాస్తులు కోరుతున్నట్లు సిడిపిఓ వెంకటలక్ష్మి తెలిపారు. గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. అంగన్వాడీ కార్యకర్త పోస్టు అల్లాపురం 2లో ఉందని తెలిపారు. అగన్వాడీ సహాయకురాలు పోస్టులు గన్నవరం కొత్తపేట, అల్లాపురం -1, అల్లాపురం -2, బుద్ధవరం -1, దుర్గాపురం, బూతిమిల్లిపాడు, పొట్టిపాడు-2,కాకులపాడు-1, కాకులపాడు-2, మల్లవల్లి -2 ఖాళీగా ఉన్నాయని, వాటికి దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. పదవ తరగతి పాసై ఉన్నవారే అర్హులన్నారు.

తలసేమియాతో పసి ప్రాణాలకు ముప్పు

అవగాహనా సదస్సులో వైద్యురాలు వీణ

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్సిటీ: తలసేమియా వ్యాధి పశి ప్రాణాలకు ముప్పుగా మారుతోందని, దీనిని ప్రారంభంలో గుర్తిస్తే శిశువుల ప్రాణాలు కాపాడవచ్చని రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్స్ వైద్యురాలు, ప్రముఖ హెమటో ఆంకాలజిస్ట్ డాక్టర్ వీణ అక్కినేని అన్నారు. అంతర్జాతీయ తలసీమియా దినోత్సవం సందర్భంగా నేడు ఆస్పత్రిలో తలసీమియా అవగాహనా సదస్సు నిర్వహించి స్క్రీనింగ్ ప్యాకేజ్ కరపత్రాన్ని ఆవిష్కరించారు. దేశంలో ప్రతియేటా సుమారు 10వేల మంది తలసీమియా మేజర్‌తో పుడుతున్నారని, వ్యాధి లక్షణాలను ముందుగా గుర్తిస్తే పశివారికి ఉపశమనం కలిగించవచ్చని డాక్టర్ వీణ అక్కినేని అన్నారు. జన్యుపరమైన లోపాలవల్ల రక్తంలో ఆరోగ్యకరమైన హెమోగ్లోబిన్ ఉత్పత్తి కాదని ఫలితంగా పిల్లల్లో తీవ్ర రక్తహీనత కలుగుతుందని ఆమె అంటూ ఇటువంటి రోగులకు ప్రతి రెండు నుంచి నాలుగు వారాలకు రక్త మార్పిడి చేయాల్సి వస్తుందన్నారు. అయితే ముందస్తు పరిక్షలుతో పాటు వ్యాధి లక్షణాలను గుర్తించి వైద్యం ప్రారంభిస్తే తలసీమియాను నివారించవచ్చని డాక్టర్ వీణ అన్నారు. రెయిన్‌బో క్లినికల్ డ్కెరక్టర్ డాక్టర్ ఎస్. రామ్ ప్రసాద్ మాట్లాడుతూ, పిల్లలు బలహీనంగా ఉండడం, అలసిపోయినట్లు కనిపించడం, చర్మం పాలిపోవడం, పశుపు రంగులోకి చర్మం మారడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వారికి వైద్య పరిక్షలు నిర్వహించాలని సూచించారు. ఫెసిలిటీ డ్కెరక్టర్ డాక్టర్ వి. ప్రసాద్ మాట్లాడుతూ, ఈనెల 31వ తేదీ వరకూ తలసీమియా నిర్ధారణ పరిక్షలు తమ హాస్పిటల్‌లో కేవలం రూ.499 కి నిర్వహిస్తున్నామని, ఈ ప్యాకేజ్‌లో భాగంగా సూపర్ కన్సల్టేషన్, హెచ్.బి. ఎలక్ట్రోఫోరేసిస్, సిబిపి పరీక్షలు ఉంటాయన్నారు. ఈ సమావేశంలో నియోనటాలజిస్ట్ డాక్టర్ బి.ఎస్.సి.పి. రాజు పాల్గొన్నారు

బ్రోచర్‌ను విడుదల చేస్తున్న వైద్యులు

నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

జర్నలిస్టుల నిరసన

ప్రజాశక్తి-నందిగామ: జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు, అక్రమ కేసులు ఎత్తి వేయాలని డిమాండ్ చేస్తూ నందిగామ ఆర్‌డిఒ కార్యాలయం వద్ద జర్నలిస్టు లు నల్ల బ్యాడ్జిలతో నిరసన తెలిపారు. జర్నలిస్టులపై దాడులు ఖండిస్తూ ఆర్‌డిఓ బాలకృష్ణకు జర్నలిస్టు నాయకులు వినతిపత్రం అందజేశారు. సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనంజయ ఒడ్డిపై పోలీసుల చర్య అమానుషమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జర్నలిస్టు సంఘాల నాయకులు ఆకుల వెంకట నారాయణ, మీరా హుస్సేన్ మాట్లాడుతూ నందిగామ నియోజకవర్గంలో పలువురు విలేకరులపై అక్రమ కేసులు బనాయించారని, తక్షణమే అక్రమ కేసులు ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. వీరులపాడు ప్రజాశక్తి విలేఖరి లాల్ అహమ్మద్ గౌస్‌పై కారణం లేకుండా సెక్షన్ 3 కేసులు నమోదు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు సంఘాల నాయకులు షాన్ బాషా, సుగుణయ్య, ప్రభాకరరావు, సాంబశివరావు, రెడ్డి, సురేష్, తోట నరసింహారావు, శ్రీనివాసరావు, సైదా, మీరా తదితరులు పాల్గొన్నారు.

మదర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: మాతృ దినోత్సవం సందర్భంగా కాలిఫోర్నియా బాదం ఆధ్వర్యంలో ప్రత్యేక వేడుకలు నిర్వహిస్తుందని నిర్వాహకులు రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు . అమ్మకు చక్కని పోషక విలువలతో కూడిన ఆహారం ఇవ్వాలని, అందుకోసం ప్రతి రోజూ ఆహార పదార్థాలలో బాదం ను చేర్చాలని అన్నారు. అమ్మను జాగ్రత్తగా చూసుకోవడం ద్వారా వేడుక జరుపుకుందాం. ఇందుకు ఒక ఆలోచనాత్మక మార్గం కాలిఫోర్నియా బాదంను ఆమె దినచర్యలో భాగం చేయడం. అనే కాప్షన్ తో వేడుకలు నిర్వహిస్తున్నామని అన్నారు. గింజల రాజుగా పిలువబడే కాలిఫోర్నియా బాదం, ప్రోటీన్, జింక్, మెగ్నీషియం, విటమిన్ ఇ వంటి 15 ముఖ్యమైన పోషకాలకు సహజ వనరుగా ఉంటుందని అన్నారు. ప్రతి ఒక్కరూ దినచర్యలో కొన్ని బాదం పప్పులను జోడించడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంతో పాటుగా, గుండె ఆరోగ్యానికి మద్దతు అందిస్తుందని మెరిసే చర్మానికి, బరువు నిర్వహణకు, శక్తిని అందించడంలో సహాయపడుతుందని తెలిపారు.

ఇఒపిఆర్‌డి జ్యోతికి ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ ఇఓపిఆర్ డి జ్యోతి, చందర్లపాడు ఎంపిడిఓగా ఉద్యోగోన్నతి పొందారు. ఈ సందర్భంగా జ్యోతి ని

నందిగామ ఎంపిడిఓ శ్రీనివాసరావు, ఎంపిపి తరపున స్టాలిన్, వైస్ ఎంపిపి ఆకుల హనుమంతరావు, టిడిపి నాయకులు తోట నాగమల్లేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్ నాగలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు ఎండి ఖాసిం, కె. రవి, జీవన జ్యోతి, శైలజ, సీతా రామిరెడ్డి, శైలజ, కష్ణ కుమారి, ఆకుల హనుమంతరావు, సిహెచ్ రవి, కావూరి సాంబశివరావు, పంచాయతీ సర్పంచులు రవి కిరణ్ రెడ్డి, అభినందించి సన్మానించారు. జ్యోతి సేవలను కొనియాడారు.

నగరోత్సవం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: గుడివాడ పట్టణంలో శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి 4642 వ జయంతి సందర్భంగా నిర్వహించిన అమ్మవారి నగరోత్సవంలో జగ్గయ్యపేట శాసనసభ్యులు, ఎపిపిఎసి సభ్యులు, టిడిపి జాతీయ కోశాధికారి శ్రీరాం రాజగోపాల్ తాతయ్య పాల్గొని ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రి టీజీ భరత్, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వరరావు, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ వైస్ చైర్మన్ గోకవరపు సునీల్, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ లు ఏచూరి రాము, కావలి వాసు, మాల్యాద్రి మరియు ఆర్యవైశ్య కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా డయాగ్నోస్టిక్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: శాస్త్రీయ ఆధారిత సాంకేతిక పరిష్కారాలను రైతుల అందుబాటు లోకి తీసుకెళ్ళలానే ఉద్దేశ్యం తో నగరంలోని నవ్యశ్రీ ఆక్వా ట్రేడర్స్ ఆధ్వర్యంలో వాటర్‌బేస్ ఆక్వా డయాగ్నోస్టిక్ సెంటర్ (ఏడీసీ అక్వా ల్యాబ్)ను ఏర్పాటు చేసినట్లు సంస్థ ఆపరేటింగ్ ఆఫీసర్ అల్లూరి చోల వర్మ, జనరల్ మేనేజర్ ఎమ్ శక్తి తెలిపారు. గురువారం నగరంలోని ఓ హోటల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీటి అండ్ సీడ్ నాణ్యత పరిశీలన, రొయ్య రోగ నిర్ధారణ, నిపుణుల సలహాలు అనేవి వాటర్ బేస్ ఏడిసి అందించే ప్రధాన సేవలుగా చెప్పారు.ఇప్పటికే నెల్లూరు, భీమవరం గణపవరం ప్రాంతాల్లో విజయవంతంగా సేవలందిస్తున్న వాటర్‌బేస్ ఆక్వా డయాగ్నోస్టిక్ సెంటర్ (ఏడిసి అక్వా ల్యాబ్) లతో పాటు తామరకొల్లు నందు ఏర్పాటు చేసినట్లు తెలిపారు ఇది కూడా అక్వా రైతులకు సమయోచిత సాంకేతిక సలహాలను అందించేందుకు తోడ్పడుతుందన్నారు. రొయ్యల సాగు చేసే రైతులకు త్వరగా, ఖచ్చితమైన సీడ్ , నీటి నాణ్యత విశ్లేషణ, రోగ నిర్ధారణ, ఉత్తమ యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పిస్తుందని రైతులకు శాస్త్రీయ పరిష్కారాలను అందించడానికి ఉపయోగపడుతుందని తెలిపారు.

సామ్‌సంగ్ విజన్ ఏఐ ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ సామ్‌సంగ్, తమ అల్ట్రా ప్రీమియం 2025 మోడళ్ల నియో క్యూఎల్ఈడీ 8కె, నియో క్యూఎల్ఈడీ 4కె, ఓఎల్ఈడీ, క్యూఎల్ఈడీ టీవీలను స్వీకరించినట్లు సంస్థ రీజినల్ ఇంచార్జి కె.సత్య కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు, . ఇది విప్లవాత్మకమైన సామ్‌సంగ్ విజన్ ఏఐ టెక్నాలజీని భారతీయ వినియోగదారులకు అందుబాటులోకి తీసుకువస్తుంది అన్నారు.. ఈ ఆవిష్కరణలో ప్రధాన ఆకర్షణగా కొత్త సామ్‌సంగ్ విజన్ ఏఐ నిలుస్తుంది. అని తెలిపారు .ఇది తదుపరి తరం ఏఐ సామర్థ్యాలతో అసమానమైన గహ వినోద అనుభవాన్ని అందిస్తుంది.అని తెలిపారు .సామ్‌సంగ్ విజన్ ఏఐ అత్యాధునిక సాంకేతిక కార్యాచరణను వ్యక్తిగతీకరించిన అనుభవంతో గరిష్ట పనితీరు కోసం ఏఐ మెరుగైన చిత్రం, ధ్వనిని జత చేస్తుంది.అని తెలిపారు.

అనధికార తవ్వకాల పరిశీలన

ప్రజాశక్తి-ఎ.కొండూరు

ఎ.కొండూరు మండలం కృష్ణారావుపాలెం సమీపంలోని గురుకులం పాఠశాల కళాశాలకు వెళ్లే రహదారిలో ప్రభుత్వ అనుమతులు లేకుండా ఒక కిలోమీటర్ పరిధిలో రోడ్డుకి అడ్డంగా తవ్విన గోతులను గురువారం ఎన్టీఆర్ జిల్లా గిరిజన శాఖాధికారిణి విజయశాంతి సందర్శించి పరిశీలించారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా అటవీ భూమిలో గోతులు తవ్విన విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి నివేదికను అందజేస్తామని తెలిపారు. గతంలో ఈ మండలంలో కిడ్నీ వ్యాధితో మరణించిన ఐదుగురికి ట్రై కార్ శాఖ ఆధ్వర్యంలో ఒక్కొక్కరికి 10వేల చొప్పున మట్టి ఖర్చులు నిమిత్తం అందజేసినట్టు తెలిపారు. ఇకపై గిరిజనులు కిడ్నీ వ్యాధితో మరణిస్తే ట్రై కార్ శాఖ ఆధ్వర్యంలో రూ.10 వేలు ఆర్థిక సహాయం కింద అందజేస్తామని తెలిపారు. అనంతరం

అటవీ భూమిలో గోతులను పరిశీలిస్తున్న విజయశాంతి

గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న సామాజిక భవనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల గిరిజన నాయకులు బాణావతు భీమా నాయక్, పీక్లా నాయక్, గొల్లమందల గ్రామ మాజీ సర్పంచ్ రాముడు నాయక్, బి.గోపిరాజు నాయక్, యడ్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చర్చి ప్రారంభం

ప్రజాశక్తి-రెడ్డిగూడెం

మండల పరిధిలోని కుదప గ్రామంలో నూతనంగా నిర్మించిన సిఎస్ఐ చర్చిని కృష్ణా, గోదావరి పీఠాధిపతులు బిషప్ తంటేపూడి జార్జికొర్నేలియస్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన దైవ సందేశం అందించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున ప్రేమవిందు నిర్వహించారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాలు

ప్రజాశక్తి-మైలవరం: వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో భాగంగా స్థానిక శాఖ గ్రంథాలయంలో గురువారం విద్యార్థుల విద్యార్థులతో కథలు చదివించి చెప్పించారు. అనంతరం ఆక్స్ఫర్డ్ స్కూల్ అధ్యాపకులు ఎం శ్రీనివాసరావు జనరల్ నాలెడ్జి గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. గణిత స్వభావం ప్రాముఖ్యత గురించి వివరించారు.

గంపలగూడెం: జిల్లా గ్రంథాలయ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గంపలగూడెం, పెనుగలను గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహించినట్లు

విజయవాడలో...

ఆయా ఇంచార్జిలు సుంకర నాగేశ్వరరావు, శ్రీలత లు తెలిపారు. గురువారం పుస్తక పఠనంతో పాటు పలు కార్యక్రమాలు విద్యార్థులకు వివరించినట్లు చెప్పారు.

కంచికచర్ల: కంచికచర్ల శాఖ గ్రంథాలయంలో గురువారం వేసవివిజ్ఞాన తరగతులు నిర్వహించారు క్రాఫ్ట్ మాస్టారు ఏం కనకారావు విద్యార్థులకు గోల్డ్ కలర్ పేపర్స్ తో నేమ్స్ రాసే పద్ధతిని విద్యార్థులకు నేర్పినారు, డ్రాయింగ్ మాస్టర్ నీలం సర్వేశ్వరరావు విద్యార్థులకు యు అనే అక్షరం ద్వారా పప్పీ బొమ్మ వేయటం విద్యార్థులకు నేర్పినారు, అనంతరం విద్యార్థులు బుక్ రీడింగ్ చేయడమైనది. గ్రంథాల అధికారి అల్లూరు రామచంద్రుడు పర్యవేక్షించారు.

జగ్గయ్యపేట: పట్టణంలోని గ్రేడ్ 1శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులలో భాగంగా గురువారం విద్యార్థులచే కథలు పుస్తకములు చదివించి వారు చదివిన పుస్తకాల్లో కథలను చెప్పించడం మరియు విద్యార్థులకు చిత్రలేఖనం పోటి నిర్వహించారు. చివరిగా విద్యార్థితో క్యారమ్స్, చదరంగం, ఆటలు ఆడించారు. ఈ కార్యక్రమంలో కవి, ఉపాధ్యాయ దోసపాటి నాగేశ్వరరావు,

కంచికచర్లలో...

గ్రంథాలయ అధికారిని శ్రీమతి ఆలేటి ప్రభ, గ్రంథాలయ సిబ్బంది జె శ్యామల, రమేష్ , రాము పాల్గొన్నారు.

విజయవాడ: చిత్తరంజన్ గ్రేడ్-2 శాఖ గ్రంథాలయంలో రిటైర్డ్ రైల్వే చీఫ్ ఆఫీసర్ కె. శేషబాల భగవద్గీత శ్లోకాలు మరియు నీతి కథలు చెప్పారు. ప్రభాస్ కాలేజీ లెక్చరర్ ఇ.వి ప్రేమ్ కుమార్ మ్యాథమెటిక్స్, రిటైర్డ్ ఉపాధ్యాయురాలు ఎమ్ అనురాధ జనరల్ నాలెడ్జ్ చెప్పించారు. అనంతరం బుద్ధ పౌర్ణమి సందర్భంగా విజయవాడ వన్‌టౌన్ జనరల్ పోస్ట్ ఆఫీస్ ఆధ్వర్యంలో మినీ స్టాంప్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. గౌతమ బుద్ధుని చిత్రంపై చిత్రలేఖనం పోటీ నిర్వహించి పాల్గొన్న విద్యార్థులందరికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి పి. సంపత్ కుమార్ పాల్గొన్నారు.

బీచ్ ఫెస్టివల్‌కు పకడ్బందీ ఏర్పాట్లు : కలెక్టర్

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ డికె బాలాజీ

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : త్వరలో జరగబోయే మసులా బీచ్ ఫెస్టివల్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన కలెక్టరేట్లోని తన చాంబర్లో జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ రావుతో కలిసి బీచ్ ఫెస్టివల్ కు చేయవలసిన ఏర్పాట్లు, బందోబస్తు తదితర అంశాలపై అధికారులతో సమీక్షిం చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ఖ్యాతిని మరింత ఇనుమడింప చేసేవిధంగా మసుల బీచ్ ఫెస్టివల్ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ ఉత్సవాలకు లక్షలాది మంది ప్రజలు తరలి వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ఎలాంటి అసౌకర్యాలు, అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రధానంగా కార్యక్రమాలన్నీ సాయంత్రం నుంచే మొదలయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో కార్యక్రమం జరిగే ప్రాంతంతో పాటు రహదారుల వెంబడి విద్యుత్ దీపాలు ఎక్కువ మొత్తంలో ఏర్పాటు చేయాలని, అవసరమైన చోట్ల సీసీ కెమెరాలు, పోలీస్ అవుట్ పోస్టులు ఏర్పాటు చేయాలన్నారు.సముద్ర తీరం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్ డి ఆర్ ఎఫ్ బందాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని, సముద్రంలో నిర్దేశిత దూరం వరకు రక్షణ వలయాలను ఏర్పాటు చేయాలన్నారు. ఉత్సవాలను తిలకించడానికి వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమద్ధిగా తాగునీటిని ఏర్పాటు చేయడంతో పాటు, పెద్ద మొత్తంలో మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో సహాయ కలెక్టర్ ఫరీన్ జైద్, డిఆర్‌ఓ కే చంద్రశేఖర రావు, బందరు డిఎస్పి చప్పిడి రాజా, బందరు ఆర్డిఓ కే స్వాతి, మెప్మా పీడీ సాయిబాబు, తహసిల్దార్ హరినాథ్, ఈవెంట్ ఆర్గనైజర్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

రౌంట్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యం

దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ : కార్మిక వర్గాల ప్రయోజనాల కోసం మే 20వ తేదీ చేపట్టనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయడానికి కృషి చేద్దామని వివిధ యూనియన్లకు చెందిన నాయకులు తెలిపారు. గురువారం మచిలీపట్నం మహాత్మ జ్యోతి బాపూలే విజ్ఞాన కేంద్రం బుట్టాయిపేట ప్రాంగణంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగర సిఐటియు అధ్యక్షులు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ కార్మికులకు నెలవారి కనీస వేతనం 26 వేల రూపాయలు ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, కొత్తగా తీసుకొస్తున్న నాలుగు లేబర్ కోడ్ లను రద్దుచేసి కార్మిక ప్రయోజన చట్టాలను కొనసాగించాలన్నారు. సిఐటియూ నగర కార్యదర్శి చిరువోలు జయరావు మాట్లాడుతూ కార్మికులకు 8 గంటల పని విధానం కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెట్టుబడిదారీ వర్గాలు కార్మికులతో అదనంగా రెండు మూడు గంటలు పని చేయించుకుని శ్రమదోపిడికి పాల్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్సూరెన్స్ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు టి చంద్రపాల్, ఆల్ ఇండియా బ్యాంకింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కోశాధికారి పూస ఉదయ్ కుమార్, మున్సిపల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎర్రం శెట్టి ఈశ్వరరావు, ఏఐటియుసి నాయకులు ఒంటి పులి లక్ష్మణరావు, మెడికల్ కాంట్రాక్టర్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి మదిరి ఫణీంద్ర, ఐ ఎన్ టియుసి యూనియన్ నాయకులు షేక్ ఆయుబ్ పాల్గొన్నారు.

నెలలో రెండు రోజులు సమాజసేవ : విసి

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : వచ్చే విద్యా సంవత్సరం నుండి ప్రతి నెలలో విద్యార్థులు, అధ్యాపకులు రెండు రోజుల పూర్తిగా సమాజసేవ కార్యక్రమాల్లో పాల్గొనేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె రాంజీ ప్రకటించారు. జాతీయ మారిటైమ్ దినోత్సవం సందర్భంగా మన సముద్రం, మన అవకాశాలు, మన హక్కులు అనే అంశం పై ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్, బోర్డు ఫర్ కమ్యూనిటీ డెవలప్మెంట్ త్రూ ఎడ్యుకేషన్ అనే సంస్థలతో కలిసి కృష్ణా విశ్వవిద్యాలయం నిర్వహించిన గూగుల్ మీట్ లో ఆయన పాల్గొని ప్రసంగించారు. నావెల్ అకాడమీతో కృష్ణా విశ్వవిద్యాలయం చేసుకున్న ఒప్పందంలో భాగంగా వచ్చే విద్యా సంవత్సరం నుండి రెండు నూతన కోర్సు లను ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. బాధ్యత గల పౌరులుగా జీవించాలి అంటే సమాజసేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఐఈఐ ఏపిఎస్సి చైర్మన్ ఆచార్య ఎంఎల్ఎస్ దేవకుమార్ మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి సుదీర్ఘ తీర ప్రాంతం ఉందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక ప్రణాళికలను రూపొంచడం శుభపరిణామం అన్నారు. విద్యార్థులు ఆయా రంగాల్లో శిక్షణ పొందితే ఉద్యోగ అవకాశాలు పుష్కలంగా ఉంటాయని చెప్పారు. మజ్గిగాన్ డాక్ షిప్ బిల్డర్స్ లిమిటెడ్ కంపెనీ ఇండిపెండెంట్ డైరెక్టర్ చందు సాంబశివరావు ముఖ్యోపన్యాసం చేస్తూ యువత సమాజం పట్ల బాధ్యత గా వ్యవహరించడం చాలా అవసరమన్నారు. ఆ దిశగా విద్యాసంస్థలు కార్యక్రమాలు రూపొందించాలన్నారు. ఐఈఐ ఏపిఎస్సి గౌ. కార్యదర్శి ఆచార్య నరేష్ బాబు సమన్వయకర్త గా వ్యవహరించిన గూగుల్ మీట్‌లో ఇండియన్ నేవీ కమాండర్ ఆదేశ్ పాల్ సింగ్, డా ఉజ్వల్ లు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కెయూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాంబాబు పాల్గొన్నారు.

రేషన్‌కార్డులపై మైక్ ప్రచారం నిర్వహించాలని వినతి

ప్రజాశక్తి-బంటుమిల్లి : బంటుమిల్లి మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో ఇళ్ల స్థలాలు అర్జీలు రేషన్ కార్డులు అర్జీలు పెట్టుకోవాలని మైక్ ప్రచారం లేదా దండోరా వేయించి ప్రజలందరికీ తెలిసే విధంగా చర్యలు తీసుకోవాలని సిపిఎం బంటుమిల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో ఆర్ఐకు వినతిపత్రం గురువారం అందించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి మాజేటి శివ శ్రీనివాసరావు మాట్లా డుతూ గతంలో లబ్ధిదారులకు వాలంటరీల ద్వారా సమాచారం తెలిసేదని, ఇప్పటికీ కొంతమంది విషయం తెలవక ఇండ్ల స్థలాల కోసం రేషన్ కార్డుల కోసం మధ్య దళారుల చుట్టూ తిరుగుతున్నారని అన్నారు. ప్రభుత్వం అధికారులు సచివాలయ పరిధిలో అన్ని గ్రామాల్లో సాటింపు చేయించి మైక్ పెట్టి ప్రచారం చేస్తే లబ్ధిదారులకు ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎల్ అజయ్ గోష్, పొదిలి వెంకన్న, వంగల రాజు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాజిల్లా కలెక్టర్‌కు పురస్కారం అందజేత

గవర్నర్ నుంచి పురస్కారం అందుకుంటున్న కలెక్టర్

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం, అంతర్జాతీయ తలసేమియా దినోత్సవం సందర్భంగా గురువారం రాజభవన్ దర్బార్ హాలులో ఏర్పాటుచేసిన ఓ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ (ఐఆర్సిఎస్) రాష్ట్ర శాఖ అధ్యక్షులు ఎస్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా పాల్గొని జిల్లా కలెక్టర్లకు పురస్కారాలు అందజేశారు. ఈ నేపథ్యంలో రెడ్ క్రాస్ ద్వారా విశిష్ట సేవలు అందించిన కష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీకి రాష్ట్ర గవర్నర్ బంగారు పతకము, పురస్కారం అందజేసి అభినందించారు. అలాగే గత ఏడాది బుడమేరు, కష్ణానది వరదలలో జిల్లా ప్రజానీకాన్ని ఆదుకునే ప్రయత్నంలో బాలాజీ చేసిన కషికి గుర్తింపుగా రెడ్ క్రాస్ ఈ అవార్డును ప్రకటించింది. కనీస రవాణా సదుపాయాలు సైతం అందుబాటులోకి రాని విపత్కర పరిస్థితుల్లో లోతట్టు ప్రాంతాలను సందర్శించి బాధితులకు బాసటగా కలెక్టర్ బాలాజీ నిలిచారు. బుడమేరు వరద, ఎదురుమొండి దీవుల వరద ముంపు బాధితులకు అండగా వరదలు పూర్తయ్యే వరకు జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి ప్రజలను విపత్తు నుండి కాపాడి వారికి పెద్దయెత్తున ఆహార పదార్థాలను సరఫరా చేయించారు.

కలెక్టర్ ను సత్కరించిన రెవిన్యూ అధికారులు

పురస్కారం అందుకున్న కలెక్టర్ డీకే బాలాజీని కలెక్టరేట్ లోని ఆయన చాంబర్లో అసిస్టెంట్ కలెక్టర్ ఫర్హీన్ జైద్, డిఆర్‌ఓ కే చంద్రశేఖర రావు,కె ఆర్ ఆర్ సి డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, ఆర్డిఓ కే స్వాతి, డిఎంఅండ్ హెచ్‌ఓ డా. శర్మిష్ట కలక్టరేట్ ఏఓసి హెచ్.వీరాంజనేయ ప్రసాద్, శ్యామ్ నాథ్,నారాయణలు సత్కరించారు.

జ్ఞానేశ్వరికి డాక్టరేట్

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : కృష్ణా విశ్వవిద్యాలయం మేనేజ్మెంట్ విభాగంలో కాంట్రాక్ట్ సహాయ ఆచార్యులు గా పనిచేస్తున్న పెడసనగంటి జ్ఞానేశ్వరి ఆంధ్రా విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ డిగ్రీ పొందారు. గహ ఆర్థిక, పెట్టుబడి నిర్ణయాలు - కృష్ణా జిల్లాలోని నమూనా కుటుంబాలలో ఆర్థిక, పెట్టుబడి నమూనాలలో వైవిధ్యాన్ని కొలిచే అధ్యయనం పై సమర్పించిన పరిశోధనకు గాను డాక్టరేట్ పొందారు. ఆంధ్రా విశ్వవిద్యాలయం ఆచార్యులు ఎస్ రజనీ పర్యవేక్షణలో పి జ్ఞానేశ్వరి పరిశోధనా గ్రంథాన్ని సమర్పించారు. డాక్టరేట్ సాధించిన జ్ఞానేశ్వరిని విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె రాంజీ, మేనేజ్మెంట్ విభాగం విభాగ అధిపతి ఎం శ్రావణి, ఆచార్యులు అభినందించారు.

రోడ్డుపైనే వర్షపు నీరు

- వాహనదారుల ఇక్కట్లు

రోడ్డుపై నిలిచిన నీరు

ప్రజాశక్తి- నందివాడ : మండలం లోని ఇలపర్రు శివారు లక్ష్మీనరసింహాపురం గ్రామంలో అకాల వర్షం కారణంగా ప్రధాన రహదారిపై గుంతలు ఏర్పడి నీళ్ల నిలవడంతో వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. గ్రామంలో నాయకులు తాత్కాలిక మరమ్మతులు చేసినప్పటికీ ఈ సమస్య పూర్తిస్థాయిలో పరిష్కారం కాలేదని గ్రామస్తులు చెబుతున్నారు. వర్షం వచ్చిందంటే చాలు గుంతలో నీరు బయటకు వెళ్లే మార్గం లేక చెరువులా తలపిస్తున్న రోడ్లపైనే వాహన రాకపోకలు, పాదాచారులు నడవాల్సిన పరిస్థితి సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మరమ్మత్తులు చేపట్టి వర్షం పడినప్పుడు గుంతలో నీళ్ల బయటకు వెళ్లేలా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నిధులు మంజూరు పట్ల హర్షం

ప్రజాశక్తి-మోపిదేవి : ప్రధాన రహదారి అభివద్ధికి నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాదును జనసేన పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. మోపిదేవి మండలం వెంకటాపురం నుంచి పెద్దకళ్లేపల్లి వరకు నూతన రహదారి నిర్మాణానికి పంచాయతీరాజ్ గ్రామీణ అభివద్ధి శాఖ ఆధ్వర్యంలో నాబార్డ్ - ఆర్ఐడీఎఫ్ ద్వారా రూ.రెండు కోట్ల అరవై లక్షలు నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు కతజ్ఞతలు తెలిపారు. జనసేన పార్టీ మోపిదేవి మండలం అధ్యక్షులు పూషడపు రత్నగోపాల్, కోసూరు నాగ మల్లేశ్వరరావు, యడ్లపల్లి లక్ష్మణరావు (బ్యాంకు బుజ్జి) పాల్గొన్నారు.

వైభవంగా ప్రతిష్టా ఉత్సవాలు

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలం పురుషోత్తపట్నం పరిధిలో నూతనంగా నిర్మించిన శ్రీ భద్రావతీ సమేత భావనారుషి స్వామి వార్ల ఆలయంలో..గురువారం విగ్రహ ప్రతిష్ఠలు వైభవంగా జరిగాయి. శ్రీ భద్రావతీ సమేత భావనారుషి, విఘ్నేశ్వరుడు, సరస్వతి దేవి విగ్రహాలను ప్రతిష్టించారు. ఈ మహెూత్సవానికి ప్రజలు, భక్తులు వేలాదిగా హాజరయ్యారు. గన్నవరం సీఐ బివి శివప్రసాద్ పూజలు చేశారు. ప్రతిష్టాపన అనంతరం 5 వేల మందికి అన్న ప్రసాద వితరణ జరిగింది. ఈ సందర్భంగా ఆలయ కమిటీవారు నిర్మించిన బస్ షెల్టర్‌ను పురుషోత్తపట్నం సర్పంచ్ మాదల రోహిణీ నాగేశ్వరరావు ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో డి. నారదమునియ్య, సామల ఆంజనేయులు, కౌతరపు రామకష్ణ, వెంగల వెంకటేశ్వరరావు, వేంగల నాని, దార్న శివాజీ పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో యువతి మృతి

ప్రజాశక్తి-కంచికచర్ల: కంచికచర్ల జంగల కాలనీ లో కరెంటు షాక్ గురై అపస్మారక స్థితిలోకి వెళ్లిన యువతి మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వరాల్లోకి వెళ్ళితే కంచికచర్ల గ్రామంలో జంగాల కాలనీ కి చెందిన చమ్మేటి నందిని (20) ఇంటిలో గురువారం విద్యుత్ షాక్ తగలటంతో అపస్మారక స్థితిలో వెళ్ళటంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆమె ను కంచికచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రమునకు తీసుకువెళ్లగా వైద్యులు ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం నందిగామ ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లగా అక్కడ వైద్యులు పరీక్షించి చనిపోయినట్టు నిర్ధారించారు.

భర్త ఆత్మహత్య

ప్రజాశక్తి-వత్సవాయి: భార్య కాపురానికి రాలేదని మనస్థాపానికి గురై భర్త పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని భీమవరం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కళ్యాణితో చందర్లపాడు మండలం వేలాది కొత్తపాలెం మార్తపూడి సురేష్ (35)కు కొన్నాళ్ల కిందట వివాహమైంది. వారికి ఇద్దరు సంతానం ఉన్నారు. కొన్ని నెలల కిందట ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. కళ్యాణి పిల్లల్ని తీసుకొని సొంత గ్రామమైన భీమవరం వచ్చి తల్లిదండ్రుల వద్ద ఉంటుంది. కాపురానికి తీసుకెళ్లేందుకు సురేష్ భీమవరం వచ్చాడు. భార్య, పిల్లలు రావడానికి నిరాకరించడంతో మనస్థాపానికి గురైన సురేష్ పురుగుల మందు తాగాడు. స్థానికులు వెంటనే జగ్గయ్యపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సర్పంచ్ పుల్లారావుకు నివాళి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని మల్కాపురం గ్రామ సర్పంచ్ అంబోజి పుల్లారావు (జాన్) బుధవారం ఆకస్మికంగా మృతిచెందారు.

గురువారం పుల్లారావు మృతదేహాన్ని స్థానిక శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్, యువ నాయకులు శ్రీరాం ధనుంజయ (చినబాబు), వైసిపి నియోజకవర్గ ఇన్చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు, జనసేన పార్టీ నాయకులు స్వామినేని వెంకట కృష్ణప్రసాద్‌బాబు సందర్శించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఘనపనేని పిచ్చియ్య చౌదరి, జి గణేష్, గ్రామ ఉపసర్పంచ్ అంభోజీ విద్యాసాగర్, అత్తలూరి కృష్ణ, గ్రామ ఉపసర్పంచ్ అంబోజి విద్యాసాగర్, మాజీ సర్పంచ్ కళ్యాణం భాస్కర్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి రైట్స్ ప్రొటెక్షన్ జనరల్ సెక్రటరీగా నాని

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం : ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఎన్టీఆర్ జిల్లా జనరల్ సెక్రెటరీగా ఇబ్రహీంపట్నం మండలం

కొండపల్లి కి చెందిన రాగాల నాని ని నియమిస్తూ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షులు బుల్లా రాజారావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు విజయవాడ అంబేద్కర్ విగ్రహం వద్ద బుల్లా రాజారావు ఎన్టీఆర్ జిల్లా కమిటీ నాయకులతో కలిసి రాగాల నానికి నియామక పత్రం అందజేశారు..అనంతరం రాజారావు మాట్లాడుతూ నూతనంగా నియమితులైన రెండు నెలల్లో జిల్లా కమిటీ తోపాటు నియోజకవర్గ, మండల, గ్రామ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నుంచి వచ్చే సంక్షేమ పథకాలు ఎస్సీ, ఎస్టీలకు అందే విధంగా కృషి చేయాలని తెలిపారు.

కమిటీ సభ్యుల నియామకానికి ఉత్వర్వులు

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ మండలంలోని పలు దేవాలయాల కు కమిటీ సభ్యుల నియామకానికి దేవాదాయ శాఖ ఉత్తర్వులు చారీ చేసినట్లు గ్రూపు దేవాలయాల ఈఓ నారాయణ నరసింహమూర్తి గురువారంఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని మాగల్లు మదన గోపాల స్వామి దేవాలయం, లింగాలపాడు లక్ష్మీ పేరంటాల అమ్మవారు దేవాలయం, దామలూరు కూడలి సంగమేశ్వర స్వామి దేవాలయం, నందిగామ పట్నం సీతారామాంజనేయ స్వామి దేవాలయాలకు పాలకవర్గ సభ్యుల ఎన్నికకు దరఖాస్తు చేసుకొని ఆయా దేవాలయాల కార్యాలయాల్లో అందజేయాలని గ్రూపు దేవాలయాల నరసింహమూర్తి తెలిపారు.

లిక్కర్ స్కామ్‌పై సిబిఐ విచారణ : ఎంపి

ప్రజాశక్తి-విజయవాడ: జగన్ పాలనలో జరిగిన రూ.3,600 కోట్ల లిక్కర్ స్కామ్ నుంచి దృష్టి మరల్చేందుకు తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని విజయవాడ ఎంపి కేశినేని శివన్నాథ్ అన్నారు.గురువారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పది రోజుల క్రితం హైదరాబాద్‌లో విజయవాడ మాజీ ఎంపితో పాటు మరో నలుగురు కలిసి డైవర్షన్ పాలిటిక్స్ చేసేందుకు, తనపై బురద చల్లేందుకు

వ్యూహారచన చేశారన్నారు. లిక్కర్ స్కామ్‌లో సూత్రధారులెవ్వరో కనిపెట్టేందుకు సిబిఐ విచారణ కోరుతూ లేఖ రాసినట్లు చెప్పారు. రాష్ట్రంలో గత ప్రభుత్వ హయంలో జరిగిన రూ.3,600 కోట్ల లిక్కర్ స్కామ్ లో భాగస్వామ్యులు ఎవరనేది అందరికీ తెలుసన్నారు. పబ్లిక్ డొమైన్‌లో వున్న తన వివరాలు సేకరించి కావాలనే అసత్య ఆరోపణలు చేశారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

రక్తదానంపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి-వన్‌టౌన్: రక్తదానంతో ప్రాణదానం సాధ్యమవుతుందని, అటువంటి రక్తదానం పట్ల ప్రతి ఒక్కరూ సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని నగరంలోని కేబీఎన్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి కృష్ణవేణి చెప్పారు. ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం, ప్రపంచ తలసేమియా దినోత్సవం సందర్భంగా కేబీఎన్ కళాశాల రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ విజయవాడ బ్రాంచ్ బ్లడ్ బ్యాంక్‌లో 12 మంది విద్యార్థులు గురువారం రక్తదానం చేసినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా గురువారం సాయంత్రం కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రక్తదాతలను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మానవతా విలువలు ప్రోత్సహించడంలో రెడ్ క్రాస్ సొసైటీ సంస్థలు చేస్తున్న సేవలు అనిర్వచనీయం అన్నారు. ప్రతి ఏడాది వందలాదిగా విద్యార్థులు తమ కళాశాల నుంచి రక్తదానం చేస్తున్నట్లు తెలిపారు. ఎస్‌కేపివివి గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి డాక్టర్ వి. నారాయణ రావు

రక్తదానం చేసిన వారితో కెబిఎన్ అధ్యాపకులు

మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రెడ్ క్రాస్ సొసైటీ చేస్తున్న మానవతా సేవలను అభినందించారు. కేబీఎన్ కళాశాల తలసేమియా వ్యాధిగ్రస్తులకు అండగా నిలుస్తుందన్నారు.రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ కోఆర్డినేటర్ బి బి ఎస్ కుమార్, కేబీఎన్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ పిఎల్ రమేష్, డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు, డాక్టర్ రామకష్ణ విద్యార్థుల విలువైన సేవను అభినందించారు. ఎన్ఎస్ఎస్ అధికారులు ఎం.శాంతిబాబు,పి. గౌతమీదేవి, కెబిఎన్ కళాశాల రెడ్ రిబ్బన్ క్లబ్ ఎన్. సాంబశివరావు రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

వివాద రహిత సమాజమే లక్ష్యం

ప్రజాశక్తి-విజయవాడ: ప్రతిఒక్కరూ సేవాభావంతో పనిచేయటం, ఇతరులకు హాని చేయకుండా ఉండటం, సర్వమత సమ్మేళనంగా ఉంటే భావి ప్రపంచం సుఖశాంతులతో మనగలుగుతుందని గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షులు మండలి వెంకట్రామ్ అన్నారు. విద్యార్థి వికాస వాహిని ఆధ్వర్యంలో విజయవాడ రామమోహన్ గ్రంథాలయంలోని అటల్ బిహారి వాజపేయి విజ్ఞాన కేంద్రంలో బుధవారం సాయంత్రం విశ్వకవి రవీంద్రుని స్మారక ప్రసంగం జరిగింది. ప్రపంచ తెలుగు రచయితల సంఘం అధ్యక్షులు గుత్తికొండ సుబ్బారావు అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్యఅతిథిగా హాజరైన మండలి వెంకట్రామ్ మాట్లాడారు. రవీంద్రుని రచనల్లో గీతాంజలు చాలా

గొప్పదనీ, ప్రపంచ సాహిత్యంలో ఇది గొప్ప రచనగా వివరించారు. మానవుల్ని కంగదీసే నిరాశా నిస్పహలను, సకల సష్టిని ప్రేమభావంతో చూసి శ్రమ గొప్పతనాన్ని సూచించే మహత్తర సందేశం గీతాంజలిలోని ముఖ్యాంశమని వివరించారు. గ్రామాభ్యుదయమే దేశాభ్యుదయమని భావరించారన్నారు.దీనికోసం శ్రీ నికేతనాన్ని నెలకొల్పి గ్రామ పునర్నిర్మాణానికి ఎంతో కషిచేశారన్నారు. ప్రపంచ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి, సాహితీ విశ్లేశకులు డాక్టర్ జి.వి.పూర్ణచందు మాట్లాడుతూ ఎక్కడ మనస్సు నిర్భయంగా ఉంటుందో, ఎక్కడ మానవుడు సగర్వంగా తలెత్తుకుని తిరుగుతాడో...ఎక్కడ విజ్ఞానం స్వేచ్ఛగా మనగలుగుతుందో...ఎక్కడ ప్రపంచం ముక్క ముక్కలై ఇరుకైన గోడల మధ్య మ్రగ్గిపోదో..అక్కడ స్వేచ్ఛ స్వాతంత్ర్యాలు ఉంటాయని గుర్తుచేశారు. భారత దేశానికి జాతీయ గీతాన్ని అందించిన కవిగా ఆయన నిలిచారన్నారు. గుత్తికొండ సుబ్బారావు మాట్లాడుతూ బాలల హదయాలను వికసింపజేయటానికి గురుకులాల తరహాలలో శాంతినికేతన్‌గా ప్రసిద్ధి గాంచిన విశ్వభారతి విద్యాలయాన్ని స్థాపించారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి వికాస వాహిని వ్యవస్థాపక అధ్యక్షులు వేములపల్లి కోటేశ్వరరావు, విజ్ఞాన వికాస వాహిని ముఖ్య సంచాలకులు మర్రి శావణి తదితరులు పాల్గొన్నారు.

33 మందికి జరిమానా

ప్రజాశక్తి-విజయవాడ: ఎన్‌టిఆర్ జిల్లా ఇన్ చార్జ్ కమిషనర్ సర్వశ్రేష్ఠ త్రిపాటి వారి ఆదేశాల మేరకు నగరంలో వివిధ ప్రదేశాలలో మద్యం సేవించి వాహనములు నడిపే చోదకులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. గురువారం 2వ, 4వ ట్రాఫిక్ పోలీసు వారు మొత్తం 33 కేసులలో మద్యం సేవించి వాహనములు నడిపే చోదకులను సంబంధిత కోర్ట్ లలో ప్రవేశపెట్టగా, న్యాయమూర్తి లెనిన్ బాబు మొత్తం 33 మందిలో 23 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున మిగిలిన 10 మందికి ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున జరిమానా విధించారు.ప్రతి రోజు ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాలు నిర్వహించి పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేశారు. వాహన చోదకులు ట్రాఫిక్ నియమ నిబంధనలు, మోటార్ వాహన చట్టాలను పాటిస్తూ సురక్షితంగా ప్రయాణం చేయాలని తెలిపారు.

సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-విజయవాడ: ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 64, 63, 62, 61, 60 డివిజన్‌లకు చెందిన లబ్ది దారులకు రూ. 2,56,046 సిఎంఆర్ఎఫ్ చెక్కులను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమ గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బొండా ఉమ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతత్వంలో రాష్ట్ర ప్రభుత్వం పేదలు, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, ఆరోగ్యం సంరక్షణకు పూర్తి భరోసా కల్పిస్తోందని అన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి, లెటర్ ఆఫ్ క్రెడిట్ ద్వారా చికిత్సకు తగిన ఆర్థిక సాయం త్వరితగతిన అందిస్తోందని తెలిపారు.ఇప్పటికే భారీగా సీఎంఆర్‌ఎఫ్ ద్వారా సెంట్రల్ నియోజకవర్గం లో కూటమి ప్రభుత్వం సాయం అందించిందని, ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఖరీదైన వైద్య చికిత్స చేయించుకోలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్న ఎన్నో కుటుంబాలకు సీఎం సహాయనిధి ఆసరాగా నిలుస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో 64 డివిజన్ ప్రధాన కార్యదర్శి బాబు, పలగాని శివ, 63వ డివిజన్ అధ్యక్షులు లబ్బా వైకుంఠం,తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణుని విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి-నందిగామ: మండలం లోని పాత బెల్లంకొండవారిపాలెం గ్రామంలో గురువారం శ్రీకృష్ణుని విగ్రహ ప్రతిష్ట మహోత్సవం జరిగింది. ఏపీ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, నందిగామ మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి కూటమి నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు అమ్మినేని జ్వాలా ప్రసాద్, గుత్తికొండ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు యంత్ర పరికరాలు పంపిణీ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో గురువారం వ్యవసాయ యాంత్రికరణ పథకంలో భాగంగా జగ్గయ్యపేట నియోజకవర్గానికి సంబంధించిన మూడు మండలాలైన జగ్గయ్యపేట, వత్సవాయి, పెనుగంచిప్రోలు కు చెందిన 131 మంది రైతులకు తైవాన్ స్ప్రేయర్లు, కల్టివేటర్లు, లెవెలింగ్ బ్లేడ్లు తదితర యంత్ర సామాగ్రిని జగ్గయ్యపేట నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా వ్యవసాయ యంత్ర పరికరాల పంపిణీ కార్యక్రమం చాలా మంచి కార్యక్రమమని రైతులకు సబ్సిడీపై ఇవ్వటం చాలా ఉపయోగకరమని, ఇందులో భాగంగా నియోజకవర్గంలోని 131 మంది రైతులకు 19.5 లక్షల రూపాయల సబ్సిడీతో వివిధ యంత్ర పరికరాలు అందజేయడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. రైతు సంఘాలకు 80 శాతం సబ్సిడీతో డ్రోన్ సరఫరా చేస్తారని ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగ పరుచుకోవాలని తెలిపారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం త్వరలో అన్నదాత సుఖీభవ పథకం కింద 14 వేల రూపాయలు, కేంద్ర ప్రభుత్వం 6 వేల రూపాయలు మొత్తం కలిపి 20 వేల రూపాయలు రైతుల ఖాతాలో జమ చేయడం జరుగుతుందని వాటికి సంబంధించిన మార్గదర్శకాలు ప్రభుత్వం విడుదల చేయడం జరిగిందని తెలిపారు. రైతుల వివరాలు పరిశీలించిన తర్వాత నగదు జమ చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ కో కన్వీనర్ ముల్లంగి

పరికరాలు అందజేస్తున్న ఎంఎల్ఏ తాతయ్య

రామకృష్ణారెడ్డి, జగ్గయ్యపేట మండల పార్టీ అధ్యక్షులు కట్టా వెంకట నరసింహారావు, వత్సవాయి మండల పార్టీ అధ్యక్షులు వడ్లమూడి రాంబాబు, కాచవరం కాలువ మాజీ చైర్మన్ యానాల గోపి, నంబూరి శ్రీనివాసరావు, వేదాద్రి సర్పంచి పేరయ్య, మాజీ సర్పంచి జగజీవన్, జగ్గయ్యపేట వ్యవసాయ శాఖ ఏడిఏ భవాని, మూడు మండలాల వ్యవసాయ అధికారులు మరియు రైతులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : అకాల వర్షాల వల్ల నష్టపరిహారాన్ని అంచనా వేసి రైతులకు న్యాయం జరిగేలా చూడాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కోసూరు శివ నాగేంద్రం గురువారం పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. అకస్మాత్తుగా వచ్చిన గాలివాన బీభత్సానికి రైతులు చాలా వరకు పూర్తిస్థాయిలో పంటలను నష్టపోయారని, ఆరుకాలం కష్టపడి, వడ్డీలకు అప్పులు తెచ్చి రైతులు పంటలను సాగు చేశారని, పంటలు చేతికి అందే సమయంలో ప్రకతివైపరీత్యం వలన సర్వం కోల్పోయారని అన్నారు. ప్రభుత్వం స్పందించి అధికారులు పంట నష్టపరిహారాన్ని అంచనా వేసి పంటలను కోల్పోయిన రైతులకు పరిహారం అందేలా చూడాలని కోరారు.వ ంగళవారం రాత్రి మండలంలోని తోట్ల వల్లూరు, వల్లూరిపాలెం, రొయ్యూరు, బొడ్డపాడు గ్రామాల్లో అకస్మాత్తుగా వచ్చిన గాలివాన బీభత్సం సష్టించిందన్నారు. లంకల్లోని మొక్కజొన్న, అరటి తోటలు నేలకొరిగాయని, అరటి తోటలు పూర్తిగా ధ్వంసం అయ్యి రైతుకు నష్టాన్ని మిగిల్చాయన్నారు.

జర్నలిస్టుల నిరసన

ప్రజాశక్తి-అవనిగడ్డ : సాక్షి ఎడిటర్ ధనుంజయ రెడ్డి ఇంట్లో పోలీసులు నిర్బంధ సోదాలు చేయడాన్ని నిరసిస్తూ దివిసీమకు చెందిన ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. గురువారం అవనిగడ్డ ప్రెస్ క్లబ్ నుంచి రాజీవ్ గాంధీ సెంటర్ మీదుగా తాసిల్దార్ కార్యాలయం వరకు జర్నలిస్టులు నల్ల బ్యాడ్జీలు ధరించి రేఖార్తులు పట్టుకొని ర్యాలీ చేశారు. అనంతరం తాసిల్దార్ నాగమల్లేశ్వరరావుకు వినసపత్రం అందజేశారు. ఏపీడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పుట్టి శ్రీనివాసరావు, సీనియర్ జర్నలిస్ట్ దోవా గోవర్ధన్, అవనిగడ్డ మోపిదేవి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అప్పికట్ల శ్రీనివాసరావు, కొండపల్లి శ్రీనివాసరావు, ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు కోట యూరిగారిన్, అలపర్తి గోపాలకష్ణ సీనియర్ పాత్రికేయులు కోట సుబ్బారావు పాల్గొన్నారు

పులిగడ్డ సర్పంచ్‌కి సన్మానం

సర్పంచ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-అవనిగడ్డ : పులిగడ్డ గ్రామ సర్పంచ్ దాసరి విజయకుమార్‌కు ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ అకాడమీ నిర్వాహకులు డాక్టర్ రేటు ప్రదానం చేసిన సందర్భంగా అవనిగడ్డలోని చైల్డ్హుడ్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సత్కరించారు. ఆర్గనైజేషన్ సెక్రటరీ టీవీ లీలా కృష్ణ ఆధ్వర్యంలో విజయ్ కుమార్‌ను దుశ్శాలువ పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా లీలా కష్ణ మాట్లాడుతూ మనిషి జీవితంలో పదవులు వస్తూ పోతుంటాయని అయితే పదవులు శాశ్వతం కాదని మనిషి చేసే సేవలు శాశ్వతం అని ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలన్నారు. ఆర్గనైజేషన్ సభ్యులు కోడూరు బాబు రాజేంద్రప్రసాద్, చైల్డ్హుడ్ ఆర్గనైజేషన్ సభ్యులు అన్నపురెడ్డి కష్ణ, బడే శ్రీనివాసరావు, నీలకంఠం రామ్మోహన్రావు పాల్గొన్నారు.

విద్యార్థినికి నగదు పురస్కారం

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల మండల పరిధిలోని శ్రీకాకుళం జిల్లా పరిషత్ హైసౌమ్యశ్రీస్కూల్ కు చెందిన కోడి బుజ్జి కుమార్తె కోడి సౌమ్యశ్రీ పదవ తరగతి ఫలితాలలో 565 మార్కులు సాధించి మండలంలో మూడో స్థానంలో నిలిచింది. పదవ తరగతి పరీక్ష ఫలితాలలో అత్యుత్తమ మార్కులు సాధించిన సౌమ్యశ్రీని గురువారం టీడీపీ కార్యాలయం వద్ద అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తనయులు మండలి వెంకట్రామ్ (రాజా) అభినందించారు. అనంతరం మండల టీడీపీ అధ్యక్షులు తుమ్మల చౌదరీ బాబు, ఎంపిటీసీ సభ్యులు తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), గ్రామ టీడీపీ అధ్యక్షులు దాసం రామకష్ణ, ఆరేపల్లి డాంగే కుమార్, జీళ్ళ శ్రీనివాస్ ల సహకారంతో 5 వేల రూపాయల ప్రైజ్ మనిని రాజా చేతుల మీదుగా అందజేశారు. ఘంటసాల మార్కెట్ యార్డ్ చైర్మెన్ తోట కనక దుర్గ, మాజీ ఎంపిటీసీ సీతారామరాజు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ నాగిని పాల్గొన్నారు.



సౌమ్యశ్రీ కి పురస్కారం అందజేస్తున్న మండలి వెంకట్రాం

కాల్వల్లో పూడికతీత పనులు చేపట్టాలి

ప్రజాశక్తి-మొవ్వ : మొవ్వ మండలంలో పంట, మురుగు కాలవలలో పేరుకుపోయిన గుర్రపు డెక్క, తూట కాడ, మేటలను తొలగించాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం కష్ణాజిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు డిమాండ్ చేశారు. గురువారం పెదముత్తేవి గ్రామంలో అయినంపూడి డ్రైన్‌లో పేరుకుపోయిన గుర్రపు డెక్కను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ కాలవలో పెరిగిపోయిన గుర్రపు డెక్కను ఉపాధి హామీ కార్మికులతో తొలగించేటట్లు చూస్తే వారికి కూడా అదనంగా పని దినాలు కల్పించినట్లు ఉంటుందన్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు స్పందించి మొవ్వ మండలంలో కాలవలలో పేరుకుపోయిన పూడికలను తొలగించాలని కోరారు.

క్వారీలు మూత.. కార్మికుల వెతలు...

- గ్రావెల్ క్వారీలు తెరిపించాలని వేడుకోలు

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం ప్రాంతంలో గ్రావెల్ క్వారీలు మూతపడ్డాయి. విజిలెన్స్ విచారణ పేరుతో ప్రభుత్వం పది నెలలుగా గ్రావెల్ తవ్వకాలను పూర్తిగా నిలిపి వేసింది. విచారణ పూర్తయి నెలలు గడుస్తున్న ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు రాకపోవడంతో క్వారీలు తెరుచుకోవడం లేదు. దీంతో భవన నిర్మాణాలు, రోడ్లు, రైల్వే కాంట్రాక్ట్ పనులకు గ్రావెల్ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతే కాకుండా ఈ రంగంపై ఆధారపడిన టిప్పర్ యాజమానులు, డ్రైవర్లు, క్లీనర్లు ఉపాధి కోల్పోతున్నారు. ఎర్ర బంగారంగా పిలుచుకునే గ్రావెల్ మట్టి ఎక్కువగా గన్నవరం నియోజ కవర్గం నుంచే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రవాణా జరుగుతుంది. నియోజక వర్గంలోని గొల్లనపల్లి, గోపవరపుగూడెం, కొండపావులూరు, పురుషోత్తపట్నం, ముస్తాబాద, విజయవాడ రూరల్లో విస్తరంగా గ్రావెల్ కొండలు ఉన్నాయి. ఈ గ్రావెల్ను భవనాలు, రోడ్లు, రైల్వేట్రాక్ నిర్మాణ పనులకు ఎక్కువగా వినియోగి స్తుంటారు. గత ప్రభుత్వంలో చిన్న ఆవుటపల్లి నుంచి గొల్లపూడి వరకు చేపట్టిన జాతీయ రహదారి బైపాస్ రోడ్డు, విజయవాడ -గుడివాడ రైల్వేలైన్లో రెండో ట్రాక్ నిర్మాణాలకు ఇక్కడి గ్రావెల్ మట్టినే ఉపయోగించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ ను లక్ష్యంగా చేసుకుంది. దీనికోసం గ్రావెల్ తవ్వకాల్లో భారీగా అవినీతి జరిగిందని విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. ఈ విచారణ నిమిత్తం నియోజకవ ర్గంలోని గ్రావెల్ మట్టి తవ్వకాలను గత పది నెలలుగా పూర్తిగా నిలిపివేసింది. మూడు నెలలు క్రితం విజిలెన్స్ విచారణను పూర్తి చేసిన అధికారులు ప్రభుత్వానికి నివేదికను కూడా సమర్పించారు. ఇక్కడి గ్రావెలను అధికంగా కేంద్ర ప్రాజెక్ట్ లకు ఉపయోగించినప్పటికీ గత పాలకులను దోషులుగా చూపించే ప్రయత్నాలు జరుగుతు న్నాయి. దీనికోసం నెలలు తరబడి గ్రావెల్ తవ్వకా లను నిలిపివేసిన కూటమి సర్కార్ కొత్తగా అనుమ తులు కూడా ఇవ్వడం లేదు. దీంతో గ్రావెల్ మట్టి రవాణా నిలిచిపోవడంతో ముఖ్యంగా భవన నిర్మాణదారులు, కాంట్రాక్టర్లు ఇబ్బందులు పడుతు న్నారు. భవన నిర్మాణ సమయంలో మెరువ నిమిత్తం గ్రావెల్ దొరక్కపోవడంతో యాజమానులకు భారంగా మారింది. అధిక ధరలను వెచ్చించి ఇతర ప్రాంతాల నుండి గ్రావెలు, మట్టిని కొను గోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

దిక్కుతోచని స్థితిలో కార్మికులు

గ్రావెల్ మట్టి తవ్వకాలు, రవాణాపై ఆధారపడి ఈ ప్రాంతానికి చెందిన వేలాది మంది జీవనం సాగిస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది టిప్పర్ యజమా నులు, డ్రైవర్లు, క్లీనర్లు, క్వారీలు వద్ద పనిచేసి కూలీలు ఉన్నారు. గత పది నెలలుగా గ్రావెల్ తవ్వకాలు జరగక పోవడంతో టిప్పర్లు నిలిచిపోయాయి. కొంత మంది యజమానులు నెలనెల వాయిదాలు చెల్లించకపోవడంతో ఫైనాన్స్ కంపెనీలు టిప్పర్లను సీజ్చసి తీసుకువె ళ్లారు. మరికొంత మంది ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక వాహనాలను విక్రయించుకుంటు న్నారు. దీంతో వీరి వద్ద పనిచేసే డ్రైవర్లు, క్లీనర్లు ఉపాధి లేక దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. గ్రావెల్ క్వారీలను పునఃప్రారంభిం చాలని ఇటీవల వీరంతా కేసరపల్లిలో ఆందోళన చేశారు. పలుమార్లు ప్రభుత్వ ప్రజాప్రతినిధులను కలిసి విజ్ఞప్తులు చేసినా సానుకూల నిర్ణయం రాకపోవడంతో తీవ్ర నిరాశకు గురవుతున్నారు. గ్రావెల్ క్వారీలు కొనుగోలు చేసిన వారు తవ్వడానికి వీలు లేక మదన పడుతున్నారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రావాల్సి ఉందం టున్నారు. లక్షల రూపాయలు పెట్టి ఇప్పటికే అనుమతులు తీసుకున్న వారి పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. వారిలోకి వెళితే యంత్రాలను లారీలను సీజ్ చేస్తున్నారు. అన్ని అనుమతులు ఉన్నాయని చెప్పిన అధికారులు మాట వినే పరిస్థితిలో లేరు. ఈ పరిస్థితిలో క్వారీలు ఇప్పుడు తెరుచుకుంటాయా అన్న అనుమానం వ్యక్తం అవుతుంది.

అగ్నిప్రమాద బాధితులకు వంటపాత్రలు అందిస్తున్న దృశ్యం

ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-మొవ్వ : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మొవ్వ మండల శాఖ చైర్మన్ బెల్లంకొండ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో తొలి నోబెల్ శాంతి బహుమతి గ్రహీత రెడ్ క్రాస్ వ్యవస్థాపకులు సర్ హెన్రీ డ్యునాంట్ జన్మదిన వేడుకలు కూచిపూడిలో జి రవిప్రకాష్ సిలికా నాంద్ర సంజీవని వైద్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిధిగా మొవ్వ మండల తహసీల్దార్, మండల ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు కె.మస్తాన్‌రావు హెన్రీ డ్యూనాంట్ చిత్రపటానికి పూలమాలలు నివాళులు అర్పించారు. అనంతరం పమిడిముక్కల మండలం, గురజాడ తోట్లవల్లూరు మండలం ఉత్తర వల్లూరు గ్రామాల్లో ఇటీవల అగ్ని ప్రమాదానికి గురైన 5 గహాల కుటుంబీకులకు వంట స్టీల్ పాత్రలు, బకెట్స్, టార్పాలిన్స్ అందించారు. అలాగే చలివేంద్రం ప్రారం భించి 800 మందికి మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్ర మంలో మొవ్వ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దోనేపూడి శివరా మయ్య, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జొన్నలగడ్డ హనుమకుమార్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

టిడిపి కంకిపాడు అధ్యక్షుడిగా నాగేశ్వరరావు

ప్రజాశక్తి-కంకిపాడు : మండల కేంద్రమైన కంకి పాడు గ్రామ టీడీపీ అధ్యక్షుడుగా చిట్టూరి నాగేశ్వరరావు (బుజ్జి)ను ఎంపిక చేశారు. పరిశీలకులు మాజీ ఎంపీపీ దేవినేని రాజా, మాజీ సర్పంచ్ బండి నాంచారయ్య, కీలక నేత తుమ్మలపల్లి హరి కృష్ణలు సమక్షంలో కొత్త కమిటీ ఎంపిక జరిగింది. ఉపాధ్య క్షుడిగా గుడిసేవ నాంచారయ్యలను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. కొత్తగా ఎన్నికైన అధ్యక్షుడిని నాయకులు అభినందించారు.

సచివాలయం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ : సచివాలయం ఉద్యోగుల సమస్యలు సత్వరమే పరిష్కరించాలని గ్రామ ,వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి హేమ కుమార్ విజ్ఞప్తి చేశారు. గడిచిన 5 సంవత్సరాలుగా జేఎల్ఎం గ్రేడ్-2 ల విషయంలో విద్యుత్ శాఖ నిర్లక్ష్యం వహిస్తుందని, గత ఏడాది జనవరి లో హ్యూమన్ రిసోర్స్ కమిటీ మినిట్స్ మీటింగ్ లో ఒప్పందం కుదుర్చుకున్న మెడికల్, కన్వేయన్స్ అలవెన్సు లు ఇప్పటి వరకు తమకు చెల్లించలేదని, వాటికి ఆ తేదీ నుంచే బకాయిలతో సహా కలిపి చెల్లించాలని డిమాండ్ చేశారు. బదిలీల విషయం లో ఇపిడిసి ఎల్ డిస్కమ్ తరహాలో ఆన్లైన్ విధానంలో పారద ర్శకంగా ఎలాంటి అవినీతికి చోటు లేకుండా బదిలీలు జరపాలని వారు కోరారు. ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని అన్నారు.

విరాళం అందజేత

ప్రజాశక్తి - గుడివాడ : స్థానిక మెయిన్ రోడ్‌లో వెంచేసియున్న శ్రీ విఘ్నేశ్వర స్వామివారి దేవస్థానంలో దేవాలయం ముఖ మండపం పునర్నిర్మాణంనకు గురువారం దొగ్గ కష్ణారావు ఆయన తలిదండ్రులు జ్ఞాపకార్థం రూ.10116లు విరాళం దేవస్థానం ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ సాయన రాజేష్‌కు అందచేశారు.

విద్యార్థిని అభినందిస్తున్న సుబ్బారావు

విద్యార్థినికి సన్మానం

ప్రజాశక్తి-తిరువూరు: పది ఫలితాల్లో మంచి మార్కులు పొందటమే గాకుండా రెండేళ్ల నుంచి వ్యాస రచన, చిత్రలేఖ న పోటీల్లో విశేష ప్రతిభ కనబరుస్తున్న గానుగ పాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎస్. మేఘనను విజయవాడలో రామ్ మోహన్ లైబ్రరీలో విశ్వకవి రవీంద్ర నాథ్ ఠాగూర్ జయంతిని పురస్కరించుకొని బుధవారం రాత్రి ప్రపంచ తెలుగు రచయితల సంఘం అధ్యక్షులు జి.సు బ్బారావు ఘనంగా సన్మానించారు. ఈకార్యక్ర మంలో మండలి వెంకట్రాం, విద్యార్థి వికాస వాహిని బాధ్యులు వి.కేశవరావు, ఎం.శ్రావణి, ప్రముఖ రచయిత జి. వి.పూర్ణ చందు, పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు ఎం. రాంప్రదీప్ పాల్గొన్నారు.

విద్యా శాఖాధికారుల పర్యటన

ప్రజాశక్తి:గంపలగూడెం: మండలంలోని జిల్లా విద్యాశాఖ అధికారులు గురువారం పర్యటించి పలు విద్యాసంబంధమైన కార్యక్రమాలను పరిశీలించినట్లు స్థానిక మండల విద్యాశాఖ అధికారి నరసింహారావు తెలిపారు. కేజీబీవీలు పీఎం బిల్డింగ్

మరియు నూతనంగా మంజూరైన డార్మెటరీ వసతి గదుల ప్లానింగ్ ను పరిశీలించారు. అదేవిధంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ఎస్సార్ కేవీఎం స్టాక్ పాయింట్ ను పరిశీలించి, అదే పాఠశాలలో నిర్మితమవుతున్న అదనపు తరగతి గదులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ జె.మహేశ్వరరావు, ఏపీసి సమగ్ర శిక్ష ఎల్.వెంకటేశ్వరరావు, కేజీబీవీ ప్రిన్సిపల్ కెవి లక్ష్మి పాల్గొన్నారు.

ట్రక్కు వితరణ

ప్రజాశక్తి-వత్సవాయి: పెనుగంచిప్రోలులోని శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ తల్లి దేవస్థానానికి అదే గ్రామానికి చెందిన ఆధ్యాత్మికవేత్త కర్ల భాస్కరరావు- పద్మావతి దంపతుల కుమారులు రామకృష్ణరావు, వసుంధర దేవి, శ్రీనివాసరావు, పద్మావతి రూ.2.50 లక్షల విలువ కలిగిన ట్రక్కును ఆలయ డిప్యూటీ కమిషనర్ కిషోర్‌కుమార్‌కు గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్త బెజవాడ శ్రీనివాసరావు, మాజీ చైర్మన్ నూతలపాటి చెన్నకేశవరావు తదితరులు పాల్గొన్నారు.

20న సమ్మెను జయప్రదం చేయాలి : కమల

ప్రజాశక్తి-వత్సవాయి: ఈ నెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు కమల కోరారు. సిఐటియు పెనుగంచిప్రోలు మండల సమావేశం సిఐటియు కార్యాలయంలో శిరీష అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా కమల మాట్లాడుతూ స్కీమ్ వర్కర్లకు పథకాలు అమలు కావడంలేదని, కనీస వేతనాలు అమలు చేయడంలేదని అన్నారు. కార్మికులను, ఉద్యోగులను మరింత అభద్రతలోకి నెట్టిన లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెనుగంచిప్రోలు కార్యదర్శి దారా నాగేశ్వరరావు, డి.వాణి, సైదమ్మ, కె.కూమారి, ఎం.జ్యోతి, జె.సరస్వతి, యం.స్వాతి, జె.నూరాబి, నాగుల్‌మీరా, ఒంటిపులి అంకుల్ పాల్గొన్నారు.

కరపత్రాలను విడుదల చేస్తున్న కమల

అకాల వర్షంతో రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి-మైలవరం
మైలవరంలో గురువారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం నుంచి ఆకాశం మేఘావృతమై చల్లని గాలులతో మైలవరం మండలంలోని పలు గ్రామాలలో ఈదురు గాలులు, ఉరుములు, పిడుగులతో భారీ వర్షం కురిసింది. పలు గ్రామాల్లో రైతులు కలాల్లో ఆరబోసిన ధాన్యం, మొక్కజొన్నలు తడవకుండా ఉండేందుకు పరుగులు తీశారు. మామిడికాయలు నేలరాలాయి. చిలుకూరు వారి గూడెం గ్రామంలోని ఓ ఇంటి వద్ద ఉన్న కొబ్బరి చెట్టుపై పిడుగు పడింది. దీంతో పరిసర ప్రాంతాలవాసులు ఆందోళన పడ్డారు. గత 20 రోజుల నుంచి రెండు మూడు రోజుల వ్యవధిలో పలుసార్లు అకాల వర్షాలు పడటంతో చేతికొచ్చిన పంటలు ధాన్యం, మొక్కజొన్నలు తడుస్తున్నాయని దీంతో నాథుడు లేక తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని పలువురు రైతులు వాపోతున్నారు.

ప్రజాశక్తి-రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండల కేంద్రంలో గురువారం సాయంత్రం సుమారు 3:30 గంటల సమయంలో భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో అర గంటకు పైగా వర్షం కురవడంతో మామిడి, ధాన్యం రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కంచికచర్ల: కంచికచర్ల మండలం లో గురువారం అకాల వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు తీవ్ర ఎండ, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరయ్యారు. సాయంత్రం

చిలుకూరువారిగూడెంలో కొబ్బరి చెట్టుపై పడిన పిడుగు

సమయంలో ఆకాశం మబ్బులు పట్టి వాతావరణం చల్లబడింది. ఇంతలో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. అప్పటి వరకు తీవ్ర ఎండ, ఉక్కపోతతో తల్లడిల్లిన జనం వాతావరణం చల్లబడటంతో ఉపశమనం పొందారు. ఈదురు గాలులకు చెట్లు విరిగిపోయాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

బకాయిలివ్వాలని ఉపాధి కార్మికుల నిరసన

నిరసన తెలుపుతున్న ఉపాధి కార్మికులు

ప్రజాశక్తి-గంపలగూడెం: మండలంలోని కనుమూరు, అనుములంక, వినగడప,నారికెంపాడు గ్రామాల్లో గురువారం బైక్ ర్యాలీ నిర్వహించినట్లు ఎన్టీఆర్ జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి కోట కళ్యాణ్ తెలిపారు. ఉపాధి బకాయిలు చెల్లించాలని కోరుతూ నారకంపాడు గంపలగూడెం ప్రధాని రహదారిపై నిరసన తెలుపుతూ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు వి నాగరాజు, ఆనందరావు పాల్గొని మాట్లాడుతూ ఎన్నో పోరాటాల ఫలితంగా సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడంపై కార్మికులు పెద్దఎత్తున ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ నెల 20న మండల కేంద్రాల్లో ఉన్న సచివాలయాల వద్ద నిరసన ప్రదర్శనలు, ధర్నాలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు మద్దిరెడ్డి వెంకటరెడ్డి, కెవిపిఎస్ ఉపాధ్యక్షుడు మల్లవరపు కుటుంబరావు, నాయకులు రుక్మిణి, జమలమ్మ పాల్గొన్నారు.

విద్యుద్ఘాతంతో మూగజీవాలు మృతి

ప్రజాశక్తి-గంపలగూడెం: విద్యుద్ఘాతంతో రెండు పాడి గేదెలు, ఒక దున్నపోతు మృత్యువాతపడ్డాయి. చిన్నం సురేష్‌కు చెందిన రెండు పాడి గేంబలు, బన్నీ పుల్లయ్య కు చెందిన దున్నపోతు మృతిచెందాయి. గత రెండు రోజుల క్రితం కురిసిన వర్షం కారణంగా విద్యుత్ తీగలు జారిన విషయాన్ని విద్యుత్ శాఖ అధికారులు గుర్తించి, పునరుద్ధరించి ఉంటే ఈ సమస్య వచ్చేది కాదని సురేష్ వాపోయాడు. ఈ విషయమై ఏఈ వాసు మాట్లాడుతూ సమస్య తమ దృష్టికివచ్చిందని వెంటనే పునరుద్ధరిస్తామని చెప్పారు.

యుబిఐ ఆధ్వర్యంలో అగ్రి రీచ్

ప్రజాశక్తి-రెడ్డిగూడెం: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రెడ్డిగూడెం బ్రాంచ్ ఆధ్వర్యంలో గురువారం అగ్రి అవుట్ రీచ్ కార్యక్రమాన్ని బ్యాంకు మేనేజర్ కే రాజేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయదారులకు, డ్వాక్రా మహిళలకు బ్యాంక్ అందిస్తున్న సేవల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఖాతాదారులు, సిబ్బంది పాల్గొన్నారు. **తిరువూరు:** తిరువూరులోని యూనియన్ బ్యాంక్ లో మేనే జర్ మురళీ ఆధ్వర్యంలో గురువారం అగ్రి అవు ట్ రీచ్ క్యాంప్ కార్యక్రమం జరిగింది. వ్యవసా యదారులను, డ్వాక్రా మహిళలను శక్తిమంతుల్ని చేయడానికి ఆర్థిక చేరికలను పెంపొందించ డానికి యూనియన్ బ్యాంక్ దేశం అంతట ఈనె ల 8 నుండి 22వ తారీకు వరకు అగ్రి అవుట్ రీచ్‌ను నిర్వహిస్తుందని డిప్యూటీ రీజినల్ హెడ్ పి. రవిరాజు తెలిపారు. దేశవ్యాప్తంగా 85 వేల పైగా శాఖలు, తొమ్మిది వేలకు పైగా ఏటీఎంలు ఉన్నాయన్నా రు. బ్యాంక్ ప్రతినిధులు వ్యవసాయ రంగానికి సంబంధిం చిన నిర్దిష్ట స్కీముల గురించి వివిధ వర్గాల వారి కి సంబంధించిన

తిరువూరులో...

ప్రత్యేకమైన సేవా సమర్పణల ను వివరణాత్మకంగా వివరించారు. ఈ సందర్భంగా అనేకమంది రైతులు, మహిళలు ఆర్థిక సహా యం కోసం పెట్టుకున్న రుణ మంజూ రు లేఖలను అందజేశారు. కార్యక్రమంలో క్రెడిట్ చీఫ్ మేనేజర్ ఉపేంద్ర, అగ్రి లోను ప్రాసెస్ చీఫ్ మేనేజర్ రసూల్ భాష, బ్యాంకు మేనేజర్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

వెంకయ్య కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-రెడ్డిగూడెం : మండల పరిధిలోని కుదప గ్రామానికి చెందిన టిడిపి ఎస్సీ వాడ నాయకుడు గొల్లమందల వెంకయ్య ఇటీవల మృతిచెందారు. టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ విజయబాబు గురువారం వెంకయ్య కుటుంబాన్ని పరామర్శించారు. వెంకయ్యని వేధించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పాటిబండ్ల కోటేశ్వరరావు, టిడిపి ఎస్సీ సెల్ మండల నాయకులు దేవిద్రాజు, నాయకులు చీపు వెంకటేశ్వరరావు, బోలాగని కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

యాక్సిస్ ఎనర్జీతో ఒప్పందాన్ని రద్దు చేయాలి

విద్యుత్ వినియోగదారుల ఐక్య వేదిక కన్వీనర్ ఆంజనేయులు

ప్రజాశక్తి-విజయవాడ: రాష్ట్రంలో ఎంతమంది అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ పట్టించుకోకుండా యాక్సిస్ ఎనర్జీ వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌తో సోలార్ ఒప్పందం ఖరారు చేసుకోవటాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు విద్యుత్ వినియోగదారుల ఐక్యవేదిక కన్వీనర్ ఎంవి ఆంజనేయులు చెప్పారు. ఈ మేరకు గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 400 మెగావాట్ల సామర్థ్యం గల సోలార్-విండ్ హైబ్రిడ్ పవర్ ప్రాజెక్టు నుండి యూనిట్ రూ.4.60కు కొనే విధంగా విద్యుత్ పంపిణీ సంస్థలు ఒప్పందం చేసుకున్నాయని పేర్కొన్నారు. పోటీ లేకుండా ఒప్పందం సరైంది కాదని, యూనిట్ ధర చాలా ఎక్కువ కావటంతో ఇది వినియోగదారులకు నష్టమని గతంలో విద్యుత్ రెగ్యులేటరీ అధారిటీ ఈ ఒప్పందాన్ని అమోదించకుండా తిప్పిపంపిందని అన్నారు. అదే ఒప్పందాన్ని ఆమోదించమని విద్యుత్ చట్టం 2003 సెక్షన్ 108 ప్రకారం ప్రస్తుత ప్రభుత్వం విద్యుత్ రెగ్యులేటరీ అధారిటీని ఆదేశించిందన్నారు. ఫలితంగా ఈ నెల 2వ తేదీ విద్యుత్ రెగ్యులేటరీ అధారిటీ ఈ ఒప్పందంపై ఆమోదముద్ర వేసిందన్నారు. గత ప్రభుత్వం ఆదానీ కంపెనీనుండి సోలార్ విద్యుత్ కొనటానికి యూనిట్ రూ.2.49కు సెకీతో ఒప్పందం చేసుకుందని పేర్కొన్నారు. అది అధిక ధర అని, వినియోగదారులకు నష్టం అని ఆనాడు అందరూ వ్యతిరేకించారని అన్నారు. భవిష్యత్తులో ప్రజలకు భారంగా మారే ఈ ఒప్పందాన్నే రద్దు చేయాలని అందరూ కోరుతున్న తరుణంలో, అంతకంటే ఎక్కువ ధరకు యాక్సిస్ ఎనర్జీ కంపెనీతో ఒప్పందం చేసుకోవటం మరింత భారాన్ని వినియోగదారులపై మోపటం కాదా అని ప్రశ్నించారు.

మాట్లాడుతున్న ఆంజనేయులు

ప్రభుత్వాలు ఇలాంటి ఒప్పందాల ద్వారా ప్రజలను దోచుకు తినటానికి కంపెనీలను అనుమతిస్తున్నాయని విమర్శించారు. యాక్సిస్ ఎనర్జీ కంపెనీతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో విద్యుత్ వినియోగదారుల ఐక్యవేదిక నాయకులు వి సాంబిరెడ్డి, ఎ పున్నారావు, వి సుందరరామరాజు, ఎం ఆరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం
పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...
మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218
విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.